# మన నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A4284

www.mananationalistvoice.com epaper.mananationalistvoice.com

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 211 | 06 గురువారం, ఆగస్టు 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-

హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ణ, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం



రిపోర్టర్లు కావలెను

మన నేషనలిస్ట్ వాయిస్ తెలుగు దిన పత్రిక

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న నేషనలిస్ట్ వాయిస్ మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది. రిపోర్టర్లు కావాలి.

ఇంకెందుకు ఆలస్యం...

9666023180.8096660656 నంబర్లకు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.


## మరోమారు ఇరాన్‌కు ట్రంప్

# ఘాటు హెచ్చరిక

### హర్మూజ్ తెరవకుంటే అంతే సంగతులు

**వాషింగ్టన్,ఆగస్ట్5( నేషనలిస్ట్ వాయిస్ ):**



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని సాధ్యమైనంత త్వరగా తెరవాలని, లేదంటే తీవ్రమైన దాడులు ఎదుర్కోవాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్‌తో తమ చర్చలు సానుకూలంగా సాగుతున్నా.. వాటిని ఆ దేశం బహిరంగంగా ఖండించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఈసారి చర్చల నుంచి వెనక్కి తగ్గితే పరిణామాలు అత్యంత తీవ్రంగా ఉంటాయని టెహ్రాన్‌ను హెచ్చరించారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అతిపెద్ద దాడికి అమెరికా సిద్ధమవుతున్న సమయంలో ఇరాన్ తమను సంప్రదించి చర్చలకు రావాలని కోరిందని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై మరో 48 గంటల్లో స్పష్టత వస్తుందని తెలిపారు. టెహ్రాన్ అణ్వాయుధాలు కలిగి ఉండేందుకు అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోదని అధ్యక్షుడు పునరుద్ఘాటించారు.

...మిగతా 2 లో...



## తుమ్మడిహట్టి పెంపునకు

# ఒత్తిడి తెండి...

● మహారాష్ట్రను ఒప్పించే బాధ్యత తీసుకోండి ● కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ వినతి ● అటవీ పర్యావరణ అనుమతులపై భూపేంద్రయాదవ్‌తో చర్చ ● ప్రధాని మోడీని తిడితే కేసు పెట్టామని వెల్లడి ● బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పెట్టలేదని ప్రశ్న

# తమిళనాట తొలి బడ్జెట్

## ప్రవేశ పెట్టిన విజయ్ ప్రభుత్వం

- 'అన్నన్ సీర్ తిట్టమ్'నకు బడ్జెట్‌లో రూ.812 కోట్లు కేటాయింపు
- పథకం కింద వధువుకు 8 గ్రాముల బంగారం, ఒక పట్టుచీర

**చెన్నై,ఆగస్ట్5( నేషనలిస్ట్ వాయిస్ ):**




తమిళనాడు ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టింది. సీఎంగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకొచ్చిన తొలి బడ్జెట్ కావడంతో సర్వత్రా ఆసక్తి వ్యక్తమైంది. ఆర్థిక మంత్రి ఎన్. మేరీ విల్సన్ దీనిని సభ ముందుంచారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మహిళా సంక్షేమం, మౌలిక సదుపాయాలపై విజయ్ సర్కార్ ఈ పద్దులో ప్రధానంగా దృష్టిసా రించి. ఎన్నికల హామీల్లో భాగమైన 'అన్నన్ సీర్ తిట్టమ్'ను టీవీకే ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ప్రకటించింది.

...మిగతా 2 లో...

## సిఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన

### షరతులతో అనుమతిచ్చిన ఎసిబి కోర్టు

**హైదరాబాద్,ఆగస్ట్5( నేషనలిస్ట్ వాయిస్ ):**



సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం, ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించేందుకు అనుమతించింది. ఇందుకోసం కోర్టు కస్టడీలో ఉన్న ఆయన పాస్‌పోర్టులను తాత్కాలికంగా విడుదల చేయాలని ఆదేశించింది. ...మిగతా 2 లో...

## పూర్తికావచ్చిన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి

- తుదిదశకు మూసారాం బాగ్ బ్రిడ్జి పనులు
- పనులను పర్యవేక్షించచన మంత్రులు

**హైదరాబాద్,ఆగస్ట్5( నేషనలిస్ట్ వాయిస్ ):**



హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులలో భాగమైన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయని హైదరాబాద్ ఇన్-ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

...మిగతా 2 లో...

# తెలంగాణలో డయల్ 112 సేవలు ప్రారంభం

- పోలీస్,ఫైర్, అంబులెన్స్‌కు ఇక ఒక్కటే నంబర్
- సేవలను ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్




**హైదరాబాద్,ఆగస్ట్5( నేషనలిస్ట్ వాయిస్ ):**

తెలంగాణలో డయల్ 112 సేవలు అందుబాటగులోకి వచ్చాయి. ఏ ఫిర్యాదుకైనా ఇక 112 ద్వారా సమాధానం వస్తుంది. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. డయల్ 112 ద్వారా 18 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. న్యాయసాయం, వైద్యసాయం, సైబర్‌సాయం అనేక సమస్యల పరిష్కారాలకు డయల్ 112 పరిష్కార మార్గమని వ్యాఖ్యానించారు. డయల్ 112కు ఫోన్ చేసినప్పుడు పోలీసులు దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించడానికి వీల్లేదని స్పష్టం చేశారు.



## హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

- నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ
- 8 ఇంటర్ కాలేజీలపై చర్యలకు ఆదేశం

**హైదరాబాద్,ఆగస్ట్5( నేషనలిస్ట్ వాయిస్**

హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.

...మిగతా 2 లో...



## క్షుద్ర పూజలపై హరీష్ వివరణ ఇవ్వాలి

- లీగల్ నోటీసులకు తగిన సమయంలో జవాబిస్తా
- నిజామబాద్‌లో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మహేశ్ గౌడ్

**నిజామాబాద్,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్ ):**

తమిళనాడు, కర్ణాటకల్లో చేసిన పూజలపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టత ఇవ్వాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. పూజల వివరాలను మీడియాకు వెల్లడించకుండా ఎందుకు గోప్యంగా ఉంచారని ప్రశ్నించారు. తమవద్ద హరీస్ పూజలపై ఆధారాలు ఉన్నాయని అన్నారు. ...మిగతా 2 లో...

## 18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు

# నోరు మెదపడం లేదు



- తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర
- గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఎపికి అనుకూల నిర్ణయాలు
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి హరీష్ రావు

**హైదరాబాద్,ఆగస్ట్5( నేషనలిస్ట్ వాయిస్ ):**

ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు లభించిన తర్వాత వాటిని సమీక్షించి రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో సాధించిన తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే దిశగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఒక ఉద్యమకారుడిగా ఈ పరిణామాలను చూస్తుంటే తనకు కడుపు రగులుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలనే ధైర్యం ఏపీకి ఎక్కడిదని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే..

...మిగతా 2 లో...

# సంపాదకీయం

## ఉదయనిధి బరితెగింపు విమర్శలు !

అధికారంలో ఉంటే పెసరం మాటలు..రెచ్చగొట్టే ప్రసంగాలు..సనాతన ధర్మంపై అవాకులు చెవాకులు పేలడం వంటివన్నీ చూశాం. డిఎంకె నేత ఉదయనిధి స్టాలిన్ నేపథ్యం ఇది. ఏదిపడితే అది మాట్లాడిన తీరుపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. డిప్యూటి సిఎంగా అధికారం వెలగబెడుతూనే సనాతన ధర్మంపై నోరు పారేసుకున్నాడు. ఇలాంటి వారికి నటుడు ప్రకాశ్ రాజ్ లాంటి వారు చెంచాలుగా ఉన్నారు. తాజాగా ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు తమిళనాట రచ్చరేపాయి. త్రిషా కృష్ణన్‌పై చేసిన వ్యాఖ్యలకు అరెస్టయి, కోర్టు తీర్పుతో బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయినా తన పెడసరం మాటలాను తగ్గించుకుంటా నని అనడం లేదు. డిప్యూటి సిఎంగా పనిచేసిన వ్యక్తి కొంత సంయమనంగా ఉండాలి. అంత మాత్రాన నోటికి ఎంత వస్తే అంత మాట్లాడేస్తానంటే కుదరదు. తాత కరుణానిధి, తండ్రి స్టాలిన్ సంపాదించిన పొలిటికల్ క్రెడిబిలిటీని వివాదాస్పద వ్యాఖ్యలతో మంటకలిపేయడం లక్ష్యంగా ఉదయనిధి రాజకీయాలు సాగుతున్నాయి. తమిళనాడు రాజకీయ చరిత్రలో నాయకుల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు సర్వసాధారణం. అయితే రాజకీయ విమర్శల పేరుతో వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లడం ఆందోళన కలిగించే విషయం. ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన ఇమేజ్‌ను దిగజార్చే అవకాశాలున్నాయి. శశికళ నుంచి నేటి త్రిష కామెంట్స్ వరకు ఆయన వ్యవహార శైలి రాజకీయాల్లో నైతికతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నిరసనల్లో పొలిటికల్ పాయింట్లు మాట్లాడకుండా వ్యక్తిగత దాడులకు దిగడం సరైన పద్ధతి కాదన్నది అందరూ ముక్త కంఠంతో విమర్శించారు. ఈ తరహా వివాదాస్పద వ్యాఖ్యలు రాబోయే రోజుల్లో డీఎంకే పార్టీకి ఎలాంటి రాజకీయ మూల్యాన్ని చెల్లించేలా చేస్తాయో వేచి చూడాలి. అయితే రాజకీయాల్లో విమర్శలు సహజమే.. కానీ వ్యక్తిగత స్థాయికి దిగజారి మహిళలపై నోరు పారేసుకోవడం ఉదయ్ నిధి స్టాలిన్ వంటి నేతలకు మాత్రమే సాధ్యమని రుజువు చేసుకున్నారు. నటి త్రిషపై ఆయన చేసిన వ్యాఖ్యలతో తమిళనాడు ఒక్కసారిగా భగ్గుమంది.. అయితే ఇలాంటి మాటలు మాట్లాడటం ఆయనకు కొత్తేమీ కాదు. సనాతన ధర్మంపై ఆ మధ్య నోరు పారేసుకున్న ఉదయనిధి స్టాలిన్, గతంలోనూ నోటికి ఎంతొస్తే అంత మాట్లాడేవారు. తంజావూరులో కావేరి నీటి పంపకాల అంశంపై నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఉదయనిధి స్టాలిన్ మాట్లాడిన సందర్భంగా ప్రభుత్వ తీరును, ముఖ్యమంత్రి విజయ్‌ను తీవ్రంగా విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం మానేసి డీఎంకేపై రాజకీయ కక్షసాధింపులకు విజయ్ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఉదయనిధి ప్రసంగిస్తున్న సమయంలో డీఎంకే కార్యకర్తలు నటి త్రిష పేరును నినాదాలుగా చేయడం ప్రారంభించారు. దానికి స్పందించిన ఉదయనిధి మన ప్రాంతానికి నీళ్లు రాకపోయినా పర్లేదు అక్కడ నీళ్లు చేరాలనేది ఆయన ఆలోచన అని డబుల్ మీనింగ్ వచ్చేలా మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సహా పలువురు రాజకీయ నాయకులు దీనిని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి నీచమైన మాటలతో మహిళలను కించపరిచా రని విమర్శిస్తున్నారు. ఉదయనిధి స్టాలిన్ మహిళలను ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకోవడం ఇదే మొదటిసారి కాదు. ఆయన ఎమ్మెల్యే కాకముందు నుంచి కూడా వరుస వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 2021 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అప్పటి ముఖ్యమంత్రి పళనిస్వామిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శశికళ కాళ్లను పట్టుకోవడానికి పళనిస్వామి శవంలా పాకారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రసంగం వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అన్నాడిఎంకె నాయకులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆయనపై డిఫమేషన్ కేసు కూడా నమోదు చేశారు. మహిళా నాయకులను, రాజకీయ ప్రత్యర్థులను దిగజార్చేలా మాట్లాడటం ఆయన శైలిగా మారిందనే విమర్శలు వచ్చాయి. విజయ్ నేతృత్వంలోని టీవీకే అధికారంలోకి వచ్చిన తర్వాత ఉదయనిధి తన వ్యాఖ్యల జోరు తగ్గించలేదు. దీనికితోడు అధికారం కోల్పోవడంతో తట్టుకోలేక పోతున్నాడు. మీడియా సమావేశంలో,తన ఎక్స్ ఖాతా పోస్ట్ ద్వారా ముఖ్యమంత్రి విజయ్‌ను సూటిగా లక్ష్యంగా చేసుకున్నారు. అసెంబ్లీ గౌరవానికి భంగం కలిగించేలా కుట్టి స్టోరీ చెప్పడం తగదని వ్యాఖ్యానించారు. చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం వెతుకుతున్న భార్య కథ తమిళనాడు అంతటికీ తెలుసంటూ వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారు. విజయ్, ఆయన భార్య సంగీత మధ్య ఉన్న వివాదాలను ఈ రకంగా ప్రస్తావించడంపై టీవీకే శ్రేణులు భగ్గుమన్నాయి. మరో సందర్భంలో మాట్లాడిన ఉదయ్ నిధి త్వరలోనే టీవీకే ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో ఐటమ్ పాటలకు డాన్సులు చేస్తారని ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలు శాసనసభ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. డిఎంకె అధినేత స్టాలిన్ తన కుమారుడిని కంట్రోల్ చేసుకోవాల్సిందే. లేకుంటే ఈ విపరీతాలు ఎంతకైనా దారితీస్తాయి. విమర్శలకు అలవాటు పడ్డ ఉదయనిధి ఇకముందు వివాదాలు సృష్టించేలా మాట్లాడకుండా ఉండలేడు. అందువల్ల డిఎంకె అధినేత స్టాలిన్‌ను అదుపులో పెట్టుకోకుంటే మూల్యం చెల్లించడం ఖాయం.

## 18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు

మొదటిపేజీ తరువాయి

ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే, జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టాడు.కాళేశ్వరం, సీతారామ లాంటి 7 ప్రాజెక్టులు రద్దు చేయండి.. తెలంగాణ నోటికాడ ముక్క లాక్కొండని ప్రతిపాదించారు. దీన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నారు. ఈనెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం అజెండాపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని జిఆర్ఎంబి సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఏపీ కోసమే అజెండా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఆర్ఎంబీలో రెండు రాష్ట్రాలుంటాయి. కేందప్రభుత్వం చైర్మన్‌గా ఉంటే.. ఓవైపు తెలంగాణ ఇంజనీర్లు, మరోవైపు ఏపీ ఇంజనీర్లు ఉంటారు.. జీఆర్ఎంబీలో ఈ ఎజెండా తయారవుతుంటే తెలంగాణ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవేళ తెలంగాణ ఇంజనీర్లు రేవంత్ రెడ్డికి చెప్పినా ఆయన పట్టించుకోలేదా..? అసలు ఈ ఎజెండా ఎట్లా వచ్చింది. ఇచ్చిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడిగే ధైర్యం ఆంధప్రదేశ్‌కు ఎక్కడిది. ఇది ఎజెండాలో పెట్టే జీఆర్ఎంబీకి ఎక్కడిది..? అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ అంటే ఎట్లా కనబడుతుంది మీకు. త్యాగాల పునాదుల మీద, పోరాటాల మీద సాధించుకున్న ఈ తెలంగాణ నీళ్ల కోసం జరిగిన ఈ ఉద్యమంలో కేసీఆర్ కష్టపడి 383 టీఎంసీల గోదావరి జలాలను మేం అనుమతులు తెచ్చినమన్నారు. తెచ్చిన అనుమతులు రద్దయితయా..? అని హరీశ్ రావు అడిగారు.

## క్షుద్ర పూజలపై హరీష్ వివరణ ఇవ్వాలి

మొదటిపేజీ తరువాయి

నిజామాబాద్‌లో టీఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. 'పక్క రాష్ట్రల్లో చేసిన పూజలపై హరీశ్‌రావు స్పష్టత ఇవ్వాలన్నారు. రాష్ట్రనికి మంచి జరగాలని కోరుకోకుండా క్షుద్ర పూజలు చేయడం శ్రేయస్కరం కాదు. నాకు ఇచ్చిన లీగల్ నోటీసులపై సరైన సమయంలో సమాధానం చెబుతానని, దీనికి భయపడే ప్రసక్తి లేదన్నారు. రాష్ట్రాభివృద్ధి దృష్ట్యానే దీనిపై మాట్లాడుతున్నాం. నాకు ఎవరిపైనా వ్యక్తిగత కక్ష లేదని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ నగరంలో మంగళవారం సాయంత్రం ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలోని బోనాలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు బోనాల పండగ ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ, మేయర్ ఉమారాణి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, డీసీసీ ప్రెసిడెంట్‌నగేశ్ రెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, శేఖర్ గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

మొదటిపేజీ తరువాయి

దాదాపు ఎనిమిది ప్రైవేటు కాలేజీలు.. రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేశాయి. హైడ్రా పేరును దుర్వినియోగం చేస్తూ నకిలీ ఫ్లై÷ర్ ఎన్‌వోసీలను సృష్టించిన కళాశాలలు.. వాటిని ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించాయి. ఈ విషయం గుర్తించిన అధికారులు దీనిపై విచారణ చేపట్టగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ చేసినట్లు నిర్ధారించారు. దీంతో నకిలీ పత్రాలు సమర్పించిన ఎనిమిది ప్రైవేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఈ ఘటనపై లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఫోర్జరీ, నకిలీ పత్రాల సృష్టి తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైడ్రా పేరుతో నకిలీ ఫైర్ నో అబజెక్షన్ సర్టిఫికెట్లు సృష్టించి ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించిన అధికారులు 8 ప్రైవేటు జూనియర్ కాలేజీలపై కేసు నమోదు చేశారు. ఈ పత్రాల ఆధారంగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఫిర్యాదు చేయడంతో లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో తెల్లాపూర్, చిక్కడపల్లి, ఎస్ఆర్ నగర్, మెహిదీపట్నం, బర్కత్‌పురా ప్రాంతంలోని 8 ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఈ ఫోర్జరీకి పాల్పడి నట్లు పోలీసులు గుర్తించారు. ఆయా కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్మీ డియట్ బోర్డుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఇదే తరహాలో సమర్పించిన మరో 60 ప్రైవేటు కాలేజీ ఫైర్ ఎన్ఓసీలను కూడా అధికా రులు స్క్రూటినీ చేస్తున్నారు. వాటి ప్రామాణికతపై విచారణ కొనసాగుతోందని, దర్యా ప్తులో మరిన్ని అక్రమాలకు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## తెలంగాణలో డయల్ 112 సేవలు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

ఒకే వ్యవస్థలోకి పోలీస్, ఫైర్, అంబులెన్స్ సేవలు, టిజిఐసిసి నుంచి డయల్ 112 సేవలను పర్యవేక్షి స్తామని డీజీపీ తెలిపారు. ప్రజల భద్రత, అత్యవసర స్పందన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. డయల్ 112 ఫోన్ రాగానే కాలర్ లొకేషన్ కోసం అడ్వాన్స్ ఆల్స్ వాడుతున్నామని పేర్కొన్నారు. డ్రోన్ బెస్డ్ టెక్నికల్ సిస్టంను త్వరలోనే తెలంగాణ పోలీసులు ఉపయోగిస్తారని వివరించారు. డ్రోన్ టీమ్‌ను సైతం ఏర్పాటు చేయబోతున్నామని చెప్పుకొచ్చారు. డయల్ 112 అనేది 3.0 వర్షన్‌గా ఉంటుందని తెలిపారు. యువ ఏపీఎస్‌లు, ఏఐ టెక్నాలజీ వాడే వారిని ఇందులో భాగస్వామ్యం చేయబోతున్నామని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు. బేసిక్ పోలీసింగ్ లాగా టెక్నాలజీ పోలీసింగ్‌ను అమల్లోకి తీసుకువస్తున్నామని వ్యాఖ్యానించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ టవర్‌లో రెండు ఫ్లోర్‌లను డయల్ 112కి కేటాయించామని తెలిపారు. డయల్ 100ను 2013లో కొంపల్లిలో జివికె వారి సాయంతో ప్రారంభించామని ప్రస్తావించారు. వివిధ అత్యవసరాలకు ఒకే నంబర్ ఉండాలని గతంలో కేంద్రప్రభుత్వం సూచించిందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టెక్నికల్ డెవలప్‌మెంట్ చేస్తూ వచ్చామని అన్నారు. ఇటీవల ఏఐ వచ్చాక అనేక పనులు సులువుగా అయిపోతున్నాయని డీజీపీ ఆనంద్ వెల్లడించారు.




## తుమ్మడిహట్టి పెంపునకు ఒత్తడి తెండి...

న్యూఢిల్లీ,ఆగస్ట్5( నేషనలిస్ట్ వాయిస్ ): మొదటిపేజీ తరువాయి

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మహారాష్ట్రతో చర్చలకు జోక్యం చేసుకోవాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కోరారు. 148 మీటర్ల ఎత్తు నిర్మాణానికి గతంలోనే ఆ రాష్ట్రం అంగీకరించిన విషయాన్ని సీఎం వివరించారు.150 మీటర్ల ఎత్తుతో నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. 150 మీటర్లకు పెంచినా ముంపు 1000 హెక్టార్లలోపు ఉంటుందని తెలిపారు. తుమ్మిడిహెట్టి నిర్మాణంతో ఎత్తిపోతల ఖర్చు లేకుండా గ్రావిటీతో నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని వివరించారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో పర్యటిస్తున్నారు. బుధవారం పలువురు కేంద్రమంత్రులను సీఎం కలవనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి షెడ్యూల్ బిజీబిజీగా ఉంది. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో.. సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ అభివృద్ధి గురించి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు, రహదారులకు శాఖాపరమైన అనుమతులపై కేంద్రమంత్రికి వినతిపత్రం ఇచ్చారు. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, ఎస్ఆర్వీ ఆర్ డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు పాల్గొన్నారు. ఇకపోతే ప్రధాని మోదీని తిడితే భాజపా రాష్ట్రాల్లో ఒక్క కేసు అయినా పెట్టారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధానిని దూషిస్తే తమ ప్రభుత్వం కేసు నమోదు చేసిందని చెప్పారు. దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఒక డీఎస్పీని బదిలీ చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారని.. అధికారిని బదిలీ చేయడం ప్రభుత్వానికి ఉన్న అధికారమని పేర్కొన్నారు. తన పరిధిలో ఉంది కాబట్టే బదిలీ చేశానని చెప్పారు. భాజపా నేతలు కూడా అసభ్యంగా దూషిస్తున్నారని సీఎం విమర్శించారు. కాక్రోచ్ జనతా పార్టీని, విద్యార్థులను అంతకంటే ఎక్కువే దూషించారని పేర్కొన్నారు.

## మరోమారు ఇరాన్‌కు ట్రంప్ ఘాటు హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి

హర్మూజ్ జలసంధిలో నౌకల స్వేచ్ఛాయుత రాకపోకలకు సంబంధించి ఇరాన్, ఒమన్‌తో కలిసి తాము చర్చలు జరుపుతున్నామని అగ్రరాజ్యం వెల్లడించింది. దీనిపై ఒకట్రెండు రోజుల్లో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ తెలిపారు. అయితే ఈ ప్రకటనను ఇరాన్ ఖండించింది. ఒమన్‌తో తాము జరుపుతున్న చర్చల్లో అమెరికా భాగస్వామ్యం ఏమాత్రం లేదని తెలిపింది. తమ సార్వభౌమాధికారాన్ని, భద్రతా ప్రయోజనాలను కాపాడే కొత్త సముద్ర రవాణా విధానాన్ని ఏర్పాటు చేయడంపైనే ఈ చర్చలు సాగుతున్నాయని పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ తాజా హెచ్చరికలు చేయడం చర్చనీయాంశంగా మారింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఏ మలుపు తిరుగుతాయన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

## తమిళనాట తొలి బడ్జెట్

### ప్రవేశ పెట్టిన విజయ్ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

దానికింద వధువుకు 8 గ్రాముల బంగారం, ఒక పట్టుచీరను అందిస్తారు. ఈ పథకం కోసం రూ.812 కోట్లు కేటాయించారు. 2031 నాటికి ఐదు లక్షల మందికి కృత్రిమ మేధలో శిక్షణ ఇస్తామని ప్రకటించింది. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు ఈ శిక్షణ అందనుంది. వెట్రిథిరన్ ట్రైనింగ్ స్కీమ్ కింద దశలవారీగా లక్షమంది ఉద్యోగార్థులు నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొం దనున్నారు. రూ.2వేల కోట్లతో విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్స్ అందిం చేందుకు వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్‌ను బ్జడెట్‌లో ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ కోసం ఈ ఏడాదికి రూ.300 కోట్లు కేటాయించారు. 'పుతియా పయనం-పుతియా వేగం' పథకం కింద 11వ తరగతి చదివే 5.3 లక్షల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందించనున్నారు. వాటితో పాటు హెల్మెట్లు, వాటిల్ బాటిళ్లు ఇవ్వనున్నారు. కుటుంబ పెద్దగా ఉన్న మహిళకు ప్రతినెలా రూ.2,500, ఏడాదికి ఉచితంగా 6 వంట గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ యువతకు ఆర్థిక సాయం, మహిళలకు అన్ని ప్రభుత్వ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం వంటి హామీలపై మాత్రం బడ్జెట్లో ప్రకటన రాలేదు.

## సిఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంతో విదేశీ పర్యటన చేపడుతున్నట్లు రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పాస్‌పోర్టులను తాత్కాలిక కస్టడీకి ఇవ్వడంతో పాటు విదేశీ ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు పిటిషన్‌ను పాక్షికంగా అనుమతించింది. విదేశీ పర్యటనకు అనుమతి ఇస్తూనే కోర్టు పలు షరతులు విధించింది. లక్ష వ్యక్తిగత బాండ్‌తో పాటు ఒక ష్యూరిటీ సమర్పించాలని ఆదేశించింది. విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి ప్రయాణ వివరాలు, అక్కడ బస చేసే చిరునామాలు, సంప్రదింపు ఫోన్ నంబర్లు కోర్టుకు అందజేయాలని పేర్కొంది. అలాగే, సెప్టెంబర్ 18లోగా పాస్‌పోర్టులను తిరిగి కోర్టులో జమ చేస్తానని అఫిడవిట్ దాఖలు చేయాలని రేవంత్ రెడ్డిని ఆదేశించింది. ఆ అఫిడవిట్ సమర్పించిన అనంతరం ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారికి లేఖ రాసి పాస్‌పోర్టులను తాత్కాలికంగా అప్పగించాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది.

## పూర్తికావచ్చిన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన మంత్రి అజారుద్దీన్‌తో కలిసి నూతనంగా రూపుదిద్దుకున్న సైదాబాద్ స్టీల్ బ్రిడ్జితో పాటు తుది దశకు చేరుకున్న మూసారాంబాగ్ బ్రిడ్జి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా, కాలేరు వెంకటేష్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సుమారు రూ.680 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఆధునిక స్టీల్ బ్రిడ్జి చంచల్‌గూడ జైలు ప్రాంగణం నుంచి ఓవైసీ ఆస్పత్రి వరకు, అలాగే మరోవైపు చంపాపేట వైపు సులభంగా వెళ్లేలా మెరుగైన కనెక్టివిటీని అందిస్తుంది. అతిత్వరలోనే ఈ వంతెనను రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సైదాబాద్, సంతోష్‌నగర్, చంచల్‌గూడ, చంపాపేట తదితర ప్రాంతాల ప్రజలకు సుదీర్ఘకాలంగా వేధిస్తున్న ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం లభించడమే కాకుండా ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. అలాగే మూసారాంబాగ్ వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు సైతం చివరి ఘట్టానికి చేరుకున్నాయని, రాకపోకలకు వీలుగా అప్రోచ్ రోడ్ల విస్తరణను వేగవంతం చేశామని తెలిపారు. నగరంలో నానాటికీ పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చేపట్టిన బ్రిడ్జి పనులతో పాటు పెండింగ్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, ప్రజా రవాణాను మరింత మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రాధాన్యమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

మన నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక



# వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన విద్యార్థులు

**తూప్రాన్, ఆగస్టు 5. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి :**

వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా తూప్రాన్ ఎంపీపీ ఎస్ (వీ్రూా) పాఠశాల ఆవరణలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెట్ల పెంపకం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పాఠశాల ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అవసరమైతే దీనికి ఆకర్షణీయమైన శీర్షిక లేదా ఫోటో క్యాప్షన్ కూడా సిద్ధం చేస్తాను.



# సైబర్ జాగృత దివస్ సందర్భంగా విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

**తూప్రాన్, ఆగస్టు 5 నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

ఆగస్టు నెల మొదటి బుధవారం నిర్వహించే సైబర్ జాగృత దివస్ (జఎవతీ జీుస్త్రతీబన్తీ్ఘ ఱఅఋుం) సందర్భంగా తూప్రాన్ మండలంలోని గణ్‌పూర్ గ్రామ జడ్పీహెచ్ఎస్ఎస్ (గ్రాఆా) పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమంలో తూప్రాన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐతో పాటు పోలీస్ అక్క, పీసీ సంగీత, పీసీ రాజు పాల్గొని విద్యార్థులకు సైబర్ భద్రతపై పలు సూచనలు చేశారు. ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్ లింకులు, నకిలీ ఉద్యోగాలు, పెట్టుబడి ఆఫర్లు, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డులు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని వివరించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులను నమ్మరాదని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ భద్రతపై ప్రతి విద్యార్థి అప్రమత్తంగా ఉండి, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా ఈ విషయాలపై అవగాహన కల్పించాలని పోలీసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి.. దర్యాప్తు చేయాలని తండ్రి ఫిర్యాదు

**తూప్రాన్, ఆగస్టు 5 (నేషనలిస్ట్ వాయిస్):**



తూప్రాన్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో నివాసముంటున్న ఓ యువకుడు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. మృతుడి తల్లి సూరారం స్వరూప పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, మృతుడు సూరారం బాలకృష్ణ (44). సుమారు 21 సంవత్సరాల క్రితం శివ్వంపేట మండలం అల్లిపూర్ గ్రామానికి చెందిన సంతోషి తో వివాహం కాగా, వారికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, గత రెండు రోజులుగా భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బాలకృష్ణ మద్యం సేవించి ఇంటికి వచ్చినట్లు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం జరగడంతో కొంతసేపు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చినట్లు సమాచారం. ఆగస్టు 5 తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న బాలకృష్ణను లేపేందుకు ప్రయత్నించగా స్పందించకపోవడంతో బంధువులకు సమాచారం ఇచ్చారు. అనంతరం అంబులెన్స్‌కు సమాచారం అందించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మృతుడి తల్లి సూరారం స్వరూప పోలీసులకు ఫిర్యాదు చేస్తూ, తన కుమారుడు ఎలా మృతి చెందాడో తెలియడం లేదని, మృతికి గల అసలు కారణాలను సమగ్రంగా విచారించి న్యాయం చేయాలని కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. పోస్టుమార్టం నివేదిక వచ్చిన అనంతరం మృతికి గల కారణాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# వ్యభిచార వృత్తిని వీడి.. గౌరవప్రద జీవనం సాగించేలా చర్యలు

**-ఉపాధి చూపి జనజీవనంలోకి తీసుకురావాలన్న సంకల్పం-గౌరవంగా జీవించేలా చేయడమే పోలీసుల సంకల్పం**

**-మహిళలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ శాఖల సమన్వయంతో కృషి-డీఎస్పీ నరేందర్ గౌడ్**





**తూప్రాన్, ఆగస్టు, 5. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

వ్యభిచార వృత్తిని వీడి గౌరవప్రదమైన జీవనం సాగించేలా మహిళలకు అండగా నిలిచి, వారిని జనజీవన ప్రవంతిలో కలిపేందుకు పోలీస్ శాఖ దృఢ సంకల్పంతో పనిచేస్తోందని డీఎస్పీ నరేందర్ గౌడ్ తెలిపారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సరోజినీ నగర్ వద్ద జాతీయ రహదారి పక్కన కొంత మంది మహి ళలు వ్యభిచార వృత్తిలో కొనసాగుతున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ఆదేశాల మేరకు వారం రోజుల క్రితం అక్కడ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 16 మందిని గుర్తించి, వారిని షెల్టర్ హోమ్‌కు తరలించారు. అనంతరం వారిని వ్యభిచార వృత్తి నుంచి బయటకు తీసుకువచ్చి, గౌరవప్రదమైన జీవనం సాగించేలా పునరావాసం కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వారికి ఉన్న నైపుణ్యాలను గుర్తించి, వాటికి అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఱ=ణాూ, =ఞూతో పాటు సంబంధిత శాఖల అధికారులు సమావేశంలో పాల్గొని మహిళలకు అందించాల్సిన శిక్షణ, స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చర్చించారు. వారి నైపుణ్యాలను గుర్తించి తగిన శిక్షణ అందించడంతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని నిర్ణయించారు. మహిళలు తిరిగి వ్యభిచార వృత్తిలోకి వెళ్లకుండా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించి, సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా చేయడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని డీఎస్పీ నరేందర్ గౌడ్ తెలిపారు. పోలీస్ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ వారికి మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు కృషి చేస్తాయని పేర్కొన్నారు. మహిళలు, బాలికల భద్రతతో పాటు సామాజికంగా వెనుకబడిన వారికి రక్షణ, పునరావాసం కల్పించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని డీఎస్పీ తెలిపారు. సరోజినీనగర్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను డీఎస్పీ నరేందర్ గౌడ్ ప్రారంభించారు. జాతీయ రహదారి పరిసరాల్లో నిఘా మరింత పటిష్టం చేయడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఱ=ణాూ, =ఞూ రామాయంపేట్ సీఐ సైదా, నార్సింగి ఎస్ఐ సృజన, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తతే ఆయుధం

## - ప్రజలకు అవగాహన కల్పించిన జిల్లా ఎస్పీ నితికా పంత్...







### సైబర్ జాగృత దివాస్ - సురక్షకా తిరంగా' కార్యక్రమంలో సైబర్ భద్రతపై విస్తృత అవగాహన..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆగస్టు 05 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైబర్ జాగ్రత్త దివాస్ – సురక్షకా తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని హెచ్ఆర్డీ భవనంలో జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రోజురోజుకు సైబర్ నేరాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పెట్టుబడి మోసాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా నేరాలు, సైబర్ బులీయింగ్, ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ స్టాకింగ్ వంటి అంశాలపై వీడియో ప్రదర్శన ద్వారా సమగ్ర అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక్కరోజులోనే సైబర్ నేరాల వల్ల సుమారు రూ.5 కోట్ల మేర ప్రజలు నష్టపోతుండగా, దేశవ్యాప్తంగా రోజుకు సుమారు రూ.70 కోట్ల వరకు సైబర్ మోసాల కారణంగా నష్టం జరుగుతోందని తెలిపారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశను ఆసరాగా చేసుకుని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని నమ్మించి సైబర్ నేరగాళ్లు అమాయకుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు కాజేస్తున్నారని హెచ్చరించారు. గుర్తుతెలి యని వ్యక్తులు పంపే ఎ పి కె ఫైళ్లు, అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయరాదని సూచించారు. బ్యాంకింగ్, సోషల్ మీడియా తదితర డిజిటల్ సేవలకు సంబంధించిన పాస్‌వర్డ్‌లను బలమైనవి, క్లిష్టమైనవిగా రూపొందించుకోవాలని తెలిపారు. ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. చిన్న నిర్లక్ష్యమే పెద్ద ఆర్థిక నష్టానికి దారితీస్తుందని, ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు .సైబర్ నేరాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్ లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే సమీప పోలీసు స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా గతంలో సైబర్ నేరాలకు గురైన పలువురు బాధితులు తమ అనుభవాలను పంచుకున్నారు. మొబైల్ ఫోన్‌ను ఉపయోగించే సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులు పంపే లింకులను ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు, బ్యాంకు వివరాలు లేదా వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ తెలియజేయవద్దని సూచించారు. కార్యక్రమం ముగింపులో సైబర్ నేరాల అవగాహన గురించిన పోస్టర్లను విడుదల చేసి, సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదుద్దీన్, కాగజ్‌నగర్ టౌన్ సీఐ ప్రేమ్‌కుమార్, రూరల్ సీఐ కుమారస్వామి, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ రవీందర్, సైబర్ క్రైమ్ ఎస్ఐలు దివ్య, కిరణ్, ఇతర ఎస్.ఐ లు రాజు, లక్ష్మణ్, నరేష్ తదితర పోలీసు అధికారులు, సైబర్ క్రైమ్ సిబ్బంది సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగ నియామకాల్లో 5వ షెడ్యూల్ ఏజెన్సీ గిరిజనులకు 75% రిజర్వేషన్లు అమలయ్యేలా చూడాలి..

### కొమురం భీం ఆసిఫాబాద్ ఎస్పీ కి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్ వినతి..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆగస్టు 05 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ (Rc No. 189/Rect./Rect.2/2026, తేది: 29 జూలై 2026) లో రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగ ఆదివాసీ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, తక్షణమే నిబంధనల ప్రకారం 75% కేటాయింపులు వర్తింపజేసి న్యాయం చేయాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కి తుడుందెబ్బ ప్రతినిధుల బృందంతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్ మాట్లాడుతూ...జీవో నంబర్ 109 SW(V) Dept (తేది: 17.06.1988), జీవో నంబర్ 30 (TW, తేది: 11.07.2019) మరియు తెలంగాణ రాష్ట్ర పోలీస్ డిపార్ట్‌మెంట్ సర్వీస్ రూల్స్ గెజెట్ నోటిఫికేషన్ (తేది: 10.05.2018) లలోని నిబంధనల ప్రకారం 5వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతాలలో 75% ఉద్యోగాలను స్థానిక గిరిజనులకే కేటాయించాల్సి ఉందన్నారు. గతంలో 2015, 2018 మరియు 2022 నోటిఫికేషన్లలో కూడా ఈ నిబంధనల ప్రకారమే అభ్యర్థులకు న్యాయం జరిగిందని గుర్తు చేశారు. అయితే, ప్రస్తుత నోటిఫికేషన్‌లో జనరల్ జీవోల ప్రకారం పోస్టులను ఇవ్వడం వల్ల ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్‌ను పరిగణనలోకి తీసుకొని, జీవో నంబర్ 24 ప్రకారం డి ఎల్ ఎస్ సి నిర్వహణ అనంతరం ఏజెన్సీ సర్టిఫికేట్ ఆధారంగా స్థానిక ఆదివాసీలతోనే ఈ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. వినతి పత్రాన్ని స్వీకరించిన జిల్లా ఎస్పీ మేడం గారు సానుకూలంగా స్పందించారు. గిరిజన అభ్యర్థుల సమస్యల తీవ్రతను గుర్తించి, ఈ వినతి పత్రాన్ని మరియు నివేదికను వెంటనే సంబంధిత పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, తదుపరి చర్యల కోసం పై అధికారులకు పంపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆత్రం అర్జున్, రాయ్ సెంటర్ పెద్దలు ఆత్రం ఆనంద్ రావ్, కుంరం శ్యాంరావ్, మరియు తుడుందెబ్బ నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడలో ఘనంగా చేనేత వస్త్ర ప్రదర్శన : చేనేత కార్మికుల సంక్షేమానికి బీజేపీ కట్టుబడి ఉంది -- రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్

**విజయవాడ, ఆగస్టు 5 ( నేషనలిస్ట్ వాయిస్)**

స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ ) ఓబీసీ మోర్చా ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నేడు "చేనేత కార్మికుల సమస్యలు, సంక్షేమానికి సంబంధించిన ప్రదర్శన (ఎగ్జిబిషన్)" అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఎగ్జిబిషన్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా చేనేత కళాకారులు ఎంతో నైపుణ్యంతో రూపొందించిన అద్భుతమైన వస్త్రాలను ఆయన పరిశీలించారు. వారి సృజనాత్మకతను, హస్తకళా నైపుణ్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. చేనేత రంగం మన దేశ సంస్కృతికి, గొప్ప సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తోందని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.చేనేత కార్మికుల సంక్షేమం, వారి సమగ్ర అభివృద్ధి మరియు సంప్రదాయ చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, బద్ధకంతో కూడిన కట్టుబడి ఉందని మాధవ్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క చేనేత కుటుంబానికి ప్రత్యక్షంగా చేరేలా చూడాలని, ఈ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అందరం కలిసి నిరంతరం శ్రమిద్దామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఎన్టీఆర్ జిల్లా శ్రేణులు, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.






# విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి సీపీ ఎన్. శ్వేత

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 05 నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

సైబర్ నేరాల బారిన పడ కుండా విద్యార్థులకు అవ గాహన కల్పించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎన్. శ్వేత అన్నారు. సుర క్షా కా తిరంగా కార్యక్రమం లో భాగంగా కాళోజీ కళా క్షేత్రంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వ హించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొ న్నారు. గుర్తు తెలియని లింకులు, సందేశాలపై క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియాలో పంచుకోవ డంలో జాగ్రత్తలు పాటిం చాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులతో సైబర్ భద్రతపై ప్రతిజ్ఞ చేయించి, అవగాహ న పోస్టర్లను ఆవిష్కరించా రు.








# రైతుల హక్కులకు భంగం కలిగించే చర్యలను సహించబోము.. ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర ఆగస్టు 4 నేషనలిస్ట్ వాయిస్**

రైతుల హక్కులకు భంగం కలిగించే చర్యలను సహించబమని స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారము నియోజకవర్గం పరిధిలో కౌకుంట్ల మండల రైతు వేదికలో ఇటీవల పుట్టపల్లి, వెంకటగిరి గ్రామాల రైతుల భూముల్లో ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా రైల్వే అధికారులు హద్దు రాళ్లు పాతిన ఘటనపై దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, ఆర్డీఓ, నవీన్, రైల్వే అధికారులు, సంబంధిత గ్రామాల రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల ఆందోళనలు, అభ్యంతరాలను స్వయంగా విన్న ఎమ్మెల్యే జియం ఆర్ , రైల్వే అధికారులు రైతులకు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవ హరిం చడం ఏమాత్రం సమంజసం కాదని అన్నారు, రైతుల హక్కులకు భంగం కలిగించే చర్యలను సహించబోమనిఆయన స్పష్టం చేశారు.ఈ అంశాన్ని వెంటనే రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) దృష్టికి తీసుకెళ్లి, రైతుల ప్రయోజనాలకు ఎలాంటి నష్టం జరగకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని రైతులకు ఆయన భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు నాయకులు రైతులు పాల్గొన్నారు.



# అప్రమత్తతే సైబర్ నేరాల నుంచి రక్షణ డీసీపీ ధార కవిత

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 05 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

దురాశ, అవగాహన లేమి ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, అప్ర మత్తతే వాటి నుంచి రక్షణ అని ధార కవిత అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సైబర్ అవగాహన కార్య క్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవితో కలిసి పాల్గొన్న ఆమె, ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమా చారాన్ని ఎట్టి పరిస్థితుల్లో నూ ఇతరులతో పంచుకోవ ద్దని సూచించారు. యూ ట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ ప్రక టనలు, అపరిచిత లింకుల ను నమ్మవద్దని హెచ్చరిం చారు. కార్యక్రమంలో అధి కారులు, సిబ్బంది సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ప్రతిజ్ఞ చేశారు.




# జనసేన పార్టీ కర్లపాలెం మండల అధ్యక్షుడు రేసులో చిలకల సురేంద్రబాబు

**బాపట్ల : ఆగస్టు 5 ( నేషనలిస్ట్ వాయిస్ )**

బాపట్ల జిల్లా బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలం జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రేసులో సీనియర్ నాయకులు చిలకల సురేంద్రబాబు ఉన్నారు.ఈ నెలలో జనసేన పార్టీ నూతన కమిటీలను ఏర్పాటు చేయనుంది.ఈ కమిటీల్లో భాగంగా కర్లపాలెం మండల అధ్యక్షుడిగా ప్రస్తుతం ఉన్న ఉపాధ్యక్షుడు చిలకల సురేంద్రబాబు ను అధ్యక్షుడిగా ఎంపిక చేసే అవకాశం పుష్కలంగా ఉంది. ఈ అధ్యక్షుడు స్థానం కోసం కర్లపాలెం మండలం నుంచి మొత్తం నలుగురు దరఖాస్తు చేసుకున్నారు వీరిలో దాదాపుగా ప్రస్తుత ఉపాధ్యక్షుడు చిలకల సురేంద్రబాబు ను అధ్యక్షుడిగా నియమించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని విశ్వసనీయ సమాచారం.

# వేధింపులపై భయపడొద్దు.. షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయండి

**తూప్రాన్, ఆగస్టు 5 (నేషనలిస్ట్ వాయిస్):**

మహిళలు, బాలికల భద్రతకు తెలంగాణ పోలీస్ శాఖ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే షీ టీమ్స్ లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలని షీ టీమ్స్ సిబ్బంది స్వరూప సూచించారు.మహిళలు, బాలికల భద్రతపై అవగాహన కల్పించేందుకు బుధవారం తూప్రాన్‌లోని మాస్టర్ మైండ్స్ జూనియర్ కళాశాలలో షీ టీమ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా స్వరూప మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరిగే వేధింపులు, ఈవ్‌టీజింగ్, అసభ్యకర ప్రవర్తనను అరికట్టేందుకు పోలీస్ శాఖ పలు చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థినులు తమకు ఎదురయ్యే ఎలాంటి వేధింపులనైనా దాచిపెట్టకుండా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు వంటి సమాచారాన్ని పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, నకిలీ లింకుల ద్వారా మోసాలకు పాల్పడుతున్నందున గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులను పూర్తిగా నమ్మి వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించరాదన్నారు. మహిళలు, బాలికలకు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం లేదా పోలీసులను సంప్రదించాలని, షీ టీమ్స్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.




# హైదరాబాద్‌లో విజయవంతంగా ముగిసిన రెండో బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యబృంద సమావేశం

**హైదరాబాద్, ఆగస్టు 5 నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ఆగస్టు 4, 5 తేదీల్లో నిర్వహించిన రెండో బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యబృందం (ూౌఱ-జశీతీతీబజ్ఱశీఅ ఔశీతీూఱఅస్త్ర +తీశీబజూ) సమావేశం, ఆస్తుల పునరుద్ధరణపై బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్ రెండో సమావేశాలు విజయవంతంగా ముగిశాయి. కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (ణశీూ) ఆధ్వర్యంలో, బ్రిక్స్‌కు భారత్ అధ్యక్షత వహిస్తున్న నేపథ్యంలో ఈ సమావేశాలు నిర్వహించబడ్డాయి. "పటిష్టత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరతల కోసం నిర్మాణం" అనే భారత అధ్యక్షతా ఇతివృత్తానికి అనుగుణంగా జరిగిన ఈ సమావేశాలకు బ్రిక్స్ సభ్య దేశాల నుంచి విధాన రూపకర్తలు, నిపుణులు, అవినీతి నిరోధక సంస్థలు, ఆర్థిక నిఘా, చట్ట అమలు సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశాన్ని సిబ్బంది, శిక్షణ శాఖ కార్యదర్శి రచనా షా ప్రారంభించి ప్రతినిధులకు స్వాగతం పలికారు. అవినీతిని ఏమాత్రం సహించని భారత విధానాన్ని పునరుద్ఘాటిస్తూ, సుపరిపాలన, పారదర్శకత, జవాబుదారీతనం, సాంకేతికత ఆధారిత పాలనతో పాటు అంతర్జాతీయ సహకారం మరింత బలోపేతం కావాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. అవినీతి కేసుల్లో దేశం దాటి పరారైన నేరస్థులను గుర్తించడం, వారి అప్పగింత ప్రక్రియను వేగవంతం చేయడం కోసం బ్రిక్స్ దేశాల చట్ట అమలు సంస్థల నిపుణులతో ప్రత్యేక అనుసంధాన వేదిక ఏర్పాటు చేయాలన్న భారత ప్రతిపాదనకు సభ్య దేశాలు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపాయి. ఈ వేదిక ద్వారా అనధికారిక సమాచార మార్పిడి, సమన్వయం పెరిగి పరారీలో ఉన్న నేరస్థులను గుర్తించడం, అప్పగింత ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు దోహదపడుతుందని సమావేశంలో అభిప్రాయపడారు. అలాగే పరారీలో ఉన్న అవినీతి నేరస్థులపై సమాచారం, వివిధ దేశాల్లో అమలులో ఉన్న విధానాలు, అనధికారిక సహకార మార్గాలను ఒకే చోట అందుబాటులో ఉంచే బ్రిక్స్ సమాచార నిధి (రిపాజిటరీ) ఏర్పాటును కూడా సభ్య దేశాలు స్వాగతించాయి. ఈ నిర్ణయాలు బ్రిక్స్ దేశాల మధ్య అవినీతి నిరోధక సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.




# బాలికపై లైంగిక దాడి కేసు:

## -నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష-రూ.20 వేల జరిమానా..

**-బాధితురాలికి రూ.లక్ష పరిహారం-దర్యాప్తు చేసిన పోలీసు సిబ్బందిని అభినందించిన**

**-జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**

**మెదక్, ఆగస్టు 5 (నేషనలిస్ట్ వాయిస్):**



15 ఏళ్ల బాలికను మాయమాటలతో నమ్మించి అపహరించి, ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు అక్తర్ (22)కు జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. అలాగే బాధితురాలికి రూ.1 లక్ష పరిహారం మంజూరు చేయాలని కోర్టు ఆదేశించింది. మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌షాప్ నిర్వహిస్తున్న అక్తర్ 15 ఏళ్ల బాలికను మాయమాటలతో నమ్మించి అపహరించి, ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి నార్సింగి ఎస్ఐ అహ్మద్ మొహినొద్దీన్ 2024 ఏప్రిల్‌లో కేసు నమోదు చేశారు. తదుపరి అప్పటి రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్ కేసు దర్యాప్తు చేపట్టి, కీలక సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య సమర్థవంతంగా వాదనలు వినిపించగా, ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడిని దోషిగా నిర్ధారించి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించారు. అలాగే బాధితురాలికి రూ.1 లక్ష పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిందితులకు శిక్ష పడేలా పటిష్టమైన దర్యాప్తు నిర్వహించి, కోర్టులో బలమైన సాక్ష్యాధారాలు సమర్పించాలని పోలీసు అధికారులకు సూచించారు.ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి నార్సింగి ఎస్ఐ అహ్మద్ మొహినొద్దీన్, అప్పటి రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్, లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీఓ సాయిబాబా, భరోసా లీగల్ అడ్వైజర్ శ్వేతా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్యలను జిల్లా ఎస్పీ అభినందించారు.

# తల్లిపాల వారోత్సవాలలో పాల్గొన్న రజని

**బాపట్ల : ఆగస్టు 5 ( నేషనలిస్ట్ వాయిస్ )**

బుధవారం బాపట్ల పట్టణంలో ని నరాలశెట్టి వారిపాలెంలో ఉన్న అంగన్వాడీ పాఠశాలలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రముఖ సమాజ సేవకురాలు బంద్రెడ్డి రజని అంగన్వాడీ టీచర్ పద్మావతి ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొని పిల్లల తల్లులకు పండ్లు గిఫ్ట్ అందచేసి తల్లి పాల యొక్క విశిష్టత,ప్రాముఖ్యత గురించి చెప్పారు.అలాగే శ్రీమంతం కార్యక్రమం కూడా నిర్వహించారు.పిల్లలందరికి స్నాక్స్ అందజేశారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు,ఆయాలు, తల్లులు,పిల్లలు పాల్గొన్నారు.



# విశాఖలో పివి సింధు స్పోర్ట్స్ అకాడమీ

## శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్

## ప్రపంచస్థాయి క్రీడాకారునలు తయారు చేయడమే లక్ష్యం

**విశాఖపట్నం,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):**

ప్రపంచ స్థాయి క్రీడాకారులను ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు అకాడమీ తయారు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. యువత ముఖంలోనే దేశ భవిష్యత్తు దాగి ఉందని పేర్కొన్నారు. పీవీ సింధు అకాడమీ ద్వారా క్రీడాకారులు వారిలోని ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. ఎలాంటి సదుపాయాలు లేని రోజుల్లోనే పట్టుదల, క్రమశిక్షణతో సింధు ఒలింపిక్స్ పతక విజేతగా, ప్రపంచ ఛాంపియన్‌గా ఎదిగారని ఉద్ఘాటించారు. విశాఖపట్నం అరిలోవ ప్రాంతంలోని తోటగరువులో తలపెట్టిన పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మాణ పనులకు మంత్రి నారా లోకేశ్ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగించారు. ప్రతి ఛాంపియన్ వెనుక కష్టపడిన తల్లిదండ్రులు, ఎప్పుడూ వెన్నుదన్నుగా నిలిచే కోచ్‌లు ఉంటారని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. కేవలం బ్యాడ్మింటనే కాకుండా, అన్ని రకాల క్రీడలకు కేంద్రంగా ఈ అకాడమిని తీర్చిదిద్దాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన అని పేర్కొన్నారు. ఈ మేరకు ఈ అకాడమీ రూపుదిద్దుకుంటోందని వివరించారు. ఈ సంస్థ బ్యాడ్మింటన్‌కే పరిమితం కాకుండా.. స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, షూటింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ క్రీడలకు కూడా నిలయంగా మారనుందని వెల్లడించారు. ఆస్ట్రేలియా, ఖతార్ తరహాలో మన దేశంలోనూ ప్రపంచ స్థాయి క్రీడాకారులను తయారు చేసేందుకు ఈ సంస్థ వేదిక కానుందని తెలిపారు. విశాఖపట్నంలో ఈ అకాడమీ నిర్మాణం విజయవంతం కావడానికి తమ ప్రభుత్వం, ప్రజల సహకారం ఎప్పుడూ ఉంటుందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. 90వ దశకంలోనే క్రీడలపై సీఎం చంద్రబాబు నమ్మకం ఉంచారని ప్రస్తావించారు. ఆ మేరకు ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పించి క్రీడా విప్లవానికి చంద్రబాబు బాటలు వేశారని ఉద్ఘాటించారు. ఈ అకాడమీ కేవలం బ్యాడ్మింటన్ మాత్రమే కాకుండా, అనేక క్రీడలకు కేంద్రంగా మారి ఆంధ్రప్రదేశ్‌లో క్రీడా సంస్కృతిని పెంచుతుందని వివరించారు. తరగతి గది జ్ఞానాన్ని ఇస్తే, క్రీడలు మనకు వ్యక్తిత్వాన్ని, పోరాట పటిమను నేర్పుతాయని చెప్పుకొచ్చారు. అందుకే ఏపీలో ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే'గా ప్రకటించామని తెలిపారు. ప్రతి చిన్నారిలోనూ ఒక సహజ ప్రతిభ దాగి ఉంటుందని వివరించారు. దానిని వెలికితీసి ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.



# సూక్ష్మ స్థాయి ప్రణాళిక ద్వారా విశాఖ రీజియన్ అభివృద్ధి



## వివిధ రంగాల్లో కీలకమైన ప్రాజెక్టులకు ప్రణాళిక

## రూ.9.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు

## విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై చంద్రబాబు

**అమరావతి,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):**

సూక్ష్మ స్థాయి ప్రణాళిక ద్వారా విశాఖ రీజియన్ మొత్తం అభివృద్ధి చేయాలన్నదే వీఈఆర్ విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టు లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బుధవారం విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడంతో పాటు ఆయన పలు సూచనలు చేశారు. వివిధ ప్రాజెక్టులను అనుసంధానించటం ద్వారా విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ ప్రగతి సాధించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నిధుల కన్వర్జెన్స్ ద్వారా వీఈఆర్ పరిధిలో అభివృద్ధి చేపట్టాలని సూచించారు. అవసరమైన మేరకు వీజీఎఫ్ స్కీంను అమలు చేయాలని తెలిపారు. ఈ సమీక్షకు సీఎస్ సాయిప్రసాద్, ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. వివిధ రంగాల్లో కీలకమైన ప్రాజెక్టుల ద్వారా రూ. 9.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. రూ. 3.50 నుంచి రూ. 4 లక్షల కోట్ల మేర ప్రభుత్వ పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించారు. ప్రైవేట్ రంగం నుంచి రూ. 5.30 లక్షల కోట్లు రాబట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. బేసిటీ ప్రాజెక్ట్ యాంకర్ ప్రాజెక్టుగా పెట్టుకుని విశాఖపట్నం రీజియన్ అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. సూక్ష్మస్థాయి ప్రణాళిక ద్వారా విశాఖపట్నం రీజియన్ మొత్తం అభివృద్ధి చేయాలన్నదే వీఈఆర్ ప్రాజెక్టు లక్ష్యమని స్పష్టం చేశారు. వీఈఆర్ పరిధిలో ఉన్న ప్రతి ప్రాంతాన్ని, ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, టూరిజం, హైడ్రోజన్, క్లీన్-టెక్ ఎనర్జీలపై దృష్టి సారించాలని అన్నారు. మూలపేట పోర్టు నుంచి రాజమహేంద్రవరం అఖండ గోదావరి ప్రాజెక్టు వరకూ వీఈఆర్ అభివృద్ధిలో భాగంగా ఉండాలని సీఎం సూచించారు. వివిధ రంగాల్లో కీలకమైన ప్రాజెక్టుల ద్వారా రూ. 9.50 లక్షల కోట్ల పెట్టుబడుల్ని ఆకర్షించేలా విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టు. రూ. 3.50-4 లక్షల కోట్ల మేర ప్రభుత్వ పెట్టుబడులు.. ప్రైవేట్ రంగం నుంచి రూ. 5.30 లక్షల కోట్లు రాబట్టేలా కార్యాచరణ. బేసిటీ ప్రాజెక్ట్ యాంకర్ ప్రాజెక్టుగా పెట్టుకుని విశాఖ రీజియన్ అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వ ఆలోచన. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. వీఈఆర్ పరిధిలో ఉన్న ప్రతి ప్రాంతాన్ని.. ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, టూరిజం, హైడ్రోజన్, క్లీన్-టెక్ ఎనర్జీ ఉండాలన్నారు. మూలపేట పోర్టు నుంచి రాజమహేంద్రవరం అఖండ గోదావరి ప్రాజెక్టు వరకూ వీఈఆర్ అభివృద్ధిలో భాగంగా ఉండాలన్నారు. వివిధ ప్రాజెక్టులను అనుసంధానించటం ద్వారా విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రగతి సాధించాలని స్పష్టం చేశారు. నిధుల కన్వర్జ్గం÷న్స్ ద్వారా వీఈఆర్ పరిధిలో అభివృద్ధి చేపట్టాలని సూచించారు.

# మత్స్యకారులకు చారిత్రక భరోసా

## బీమా, సబ్సిడీ, భృతిలో కూటమి ప్రభుత్వ విప్లవాత్మక నిర్ణయాలు

## - గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బీమా పరిహారాలన్నీ చెల్లింపు

## - విద్యుత్ సబ్సిడీలో భారీ పెంపు- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి, ఆగస్ట్ 05 (నేషనలిస్ట్ వాయిస్):**



మత్స్యకారుల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని కూటమి ప్రభుత్వం చారిత్రక నిర్ణయాలు అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రతి అంశంలోనూ న్యాయం చేస్తూ, మత్స్యకార కుటుంబాలకు నిజమైన భరోసా కల్పిస్తున్నామన్నారు. మాటల్లో కాదు... చేతల్లో సంక్షేమాన్ని చూపించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ విధానమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన మత్స్యకారుల బీమా పరిహారాలను పూర్తిగా చెల్లించడంతో పాటు, బీమా పథకాన్ని విస్తరించడం, విద్యుత్ సబ్సిడీని గణనీయంగా పెంచడం, వేట నిషేధ కాల భృతిని భారీగా పెంచి అందించడం వంటి అనేక చారిత్రక నిర్ణయాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. గణాంకాలే కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి, గత ప్రభుత్వ వైఫల్యాలకు ప్రత్యక్ష సాక్ష్యాలని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. మత్స్యకారులకు నిజమైన మేలు జరిగిందంటే అది తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని ప్రభుత్వాల హయాంలోనే జరిగిందని, మత్స్యకారుల సంక్షేమాన్ని రాజకీయాల కోసం కాకుండా బాధ్యతగా భావించి పనిచేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీకి ఉందన్నారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులను అన్ని విధాలా నిరాశపరిచింది. మరణించిన మత్స్య కారుల కుటుంబాలకు అందాల్సిన బీమా పరిహారాలు, నష్టపరిహారాలను సైతం చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టింది. కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలను ఆదుకోవాల్సిన సమయంలో కూడా ఆ ప్రభుత్వం మానవత్వం చూపలేక పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన బీమా పరిహారాలన్నింటినీ చెల్లించి బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాం. ఈ బీమా పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2,56,66,000, కేంద్ర ప్రభుత్వం రూ. 4,20,00,000 వెచ్చిస్తూ, మొత్తం రూ. 6,76,66,000తో మత్స్యకార కుటుంబాలకు రక్షణ కల్పిస్తోంది. అంతేకాదు, కేవలం సంప్రదాయ మత్స్యకారులకే కాకుండా అర్హులైన మత్స్యరంగ అనుబంధ వృత్తుల్లో పనిచేస్తున్న కార్మికులను కూడా బీమా పరిధిలోకి తీసుకువచ్చి, వారి కుటుంబాలకు భరోసా కల్పించే చారిత్రక నిర్ణయం తీసుకున్నాం. గత ప్రభుత్వంతో పోలిస్తే మత్స్యకారుల బీమా పథకంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని, గతంలో 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మత్స్యకారులకు మాత్రమే బీమా వర్తించేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వయోపరిమితిని 18 నుంచి 70 సంవత్సరాలకు పెంచి మరింత మంది మత్స్యకారులకు భరోసా కల్పించామని చెప్పారు. గతంలో ఈ పథకం కేవలం సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు మాత్రమే పరిమితమై ఉండేదని, ప్రస్తుతం సముద్ర మత్స్యకారులతో పాటు లోతట్టు ప్రాంతాల్లో చేపల వేట, చేపల పెంపకంపై ఆధారపడిన మత్స్యకారులకు కూడా బీమా వర్తించేలా విస్తరించామని మంత్రి వివరించారు. గతంలో సుమారు 1.30 లక్షల కుటుంబాలకు మాత్రమే రూ. 5 లక్షల బీమా సౌకర్యం అందుబాటులో ఉండేదని, ప్రస్తుతం పథకాన్ని విస్తరించి సుమారు 8 లక్షల మంది వరకు బీమా రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. అంతేకాకుండా, గత ప్రభుత్వంలో వేట చేస్తున్న సమయంలో మరణించినప్పుడే రూ. 5 లక్షల బీమా పరిహారం లభించేదని, కానీ కూటమి ప్రభుత్వం ఆ పరిమితిని తొలగించి ఫిషింగ్ కార్యకలాపాల్లో ఉన్న సమయంలోనైనా, ఇంటి వద్ద ఉన్నప్పుడైనా, ఏ కారణంతో మరణించినా అర్హులైన మత్స్యకార కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా ప్రయోజనం అందేలా చారిత్రక నిర్ణయం తీసుకుందని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. గతంలో ఈ పథకం ప్రత్యక్షంగా చేపల వేటలో పాల్గొనే మత్స్యకారులకు మాత్రమే పరిమితమై ఉండేదని, ఇప్పుడు రొయ్యల పరిశ్రమలు, ఫీడ్ పరిశ్రమలు, రొయ్యలు, చేపల చెరువులు తదితర మత్స్యరంగ అనుబంధ వృత్తుల్లో పనిచేస్తున్న కార్మికులను కూడా బీమా పరిధిలోకి తీసుకొచ్చామని తెలిపారు. ఆర్థికంగా అనేక సవాళ్లు ఉన్నప్పటికీ, మత్స్యకారులు, మత్స్యరంగ కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమమే లక్ష్యంగా రూ. 6.82 కోట్లకు పైగా వెచ్చించి లక్షలాది మందికి బీమా రక్షణ కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

# హిందూ దేవుళ్లను కించపరుస్తున్న ప్రకాశ్ రాజ్

## సైబర్ డిజికి భాను ప్రకాశ్ తదితరుల ఫిర్యాదు

**అమరావతి,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):**

హిందూ దేవుళ్లపై సోషల్ మీడియాలో పోస్టులు, నటుడు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలపై సైబర్ డీజీ రవిశంకర్‌కు బీజేపీ నేతల బృందం ఫిర్యాదు చేసింది. 57 మంది వివరాలతో బీజేపీ నేతలు భానుప్రకాశ్ రెడ్డి, వల్లూరు జయప్రకాష్, షేక్ బాజీ, శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాశ్ మాట్లాడుతూ.. భారత సంస్కృతిలో శ్రీరామచంద్రుడిని ఆరాధ్య దైవంగా చూశామని.. దేవతా మూర్తులు మాతా సరస్వతి, లక్ష్మీదేవి గాని, సీతమ్మను తల్లిగా భావిస్తున్నామని తెలిపారు. హిందూ దేవుళ్లపై అనరాని మాటలు అంటున్నారని భాను ప్రకాశ్ మండిపడ్డారు. ఈ వీడియోలను చూడలేకపోయామన్నారు. హిందూ దేవుళ్లను ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు. 'ఒళ్లు జాగ్రత్త, తోలు తీస్తాం జాగ్రత్త! వదిలే ప్రసక్తే లేదు!' అని హెచ్చరించారు. హిందూ దేవుళ్లపై ప్రకాశ్ రాజ్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శ్రీరామచంద్రుడు ఉత్తర దేశం నుంచి దక్షిణ దేశానికి వచ్చారని, పండ్లు దొంగిలించారని చెబుతున్నారని ఫైర్ అయ్యారు. దమ్ము, ధైర్యం ఉంటే అన్యమతస్తుల్లో జరుగుతున్న అన్యాయాల గురించి మాట్లాడాలని సవాల్ విసిరారు. కేవలం హిందూ మతం, హిందూ దేవుళ్లపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని.. ఇటువంటి వారిని కఠినంగా శిక్షించాలని భానుప్రకాశ్ రెడ్డి డిమాండ్ చేశారు.






# ఆర్ అండ్ బీ శాఖ పురోగతిపై క్షేత్రస్థాయి అధికారులతో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సమీక్ష

**విజయవాడ, ఆగస్టు 5 (నేషనలిస్ట్ వాయిస్):**

ఆర్ అండ్ బి శాఖ పురోగతిపై క్షేత్రస్థాయి అధికారులతో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. విజయవాడ ఆర్ ఁ బీ శాఖ ఈఎన్సీ కార్యాలయంలో ఈఎన్సీ రామచంద్ర, శేషు కుమార్, చీఫ్ ఇంజినీర్లు విజయ శ్రీ, నవీన్, బుచ్చిరాజు, ఎస్ ఇ, ఈఈ లు, ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష చేసారు. రాష్ట్రంలో మొత్తం 45,433 కి.మీ ఆర్ ఁ బీ రహదారులు ఉండగా, 10,238 కి.మీ రహదారుల అభివృద్ధి చేపట్టాల్సి ఉందన్న మంత్రి, రూ. 2,500 కోట్లతో 6,061 కి.మీ రహదారుల అభివృద్ధి పనుల్లో 53 % మాత్రమే పూర్తి చేసామని అధికారులు తెలిపారు. రూ. 514 కోట్లతో చేపట్టిన పనుల్లో తీవ్ర జాప్యం నెలకొన్న క్రమంలో, వెనుకబడి ఉన్న జిల్లాల అధికారులు మరింత పురోగతి సాధించాలని మంత్రి సూచించారు. డిమాండ్ కు తగ్గట్లు బిటుమన్ సప్లై లో కొరతతో పనులు ముందుకు సాగట్లేదని అధికారులు సమాధానం ఇచ్చారు. రెండేళ్లలో కూటమి ప్రభుత్వం రూ. 8,530 కోట్ల నిధులు మంజూరు చేసి, పనులు చేపడితే, ఇప్పటికే రూ. 4,110 కోట్ల బిల్లులు చెల్లించామన్న మంత్రి, నెల వారీ టార్గెట్ పెట్టుకొని పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ంో ఁ్ల అభివృద్ధి పనుల్లో వెనుకబడిన జిల్లాల్లో వచ్చే నెలలో స్వయంగా పర్యటిస్తానని, ఈ లోపు పురోగతి సాధించాలని అధికారులకు మంత్రి సూచించారు. ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో తరచూ దెబ్బతినే 1,009 కి.మీ రహదారుల అభివృద్ధికి రూ. 1,683 కోట్ల ప్రతిపాదనలకు ప్రభుత్వం అనుమతి రావాల్సి ఉందని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న దాదాపు 100 వంతెనల పునర్ నిర్మాణానికి రూ. 818 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు వివరించారు. పత్రికలు, సోషల్ మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలపై క్షేత్రస్థాయి అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలని మంత్రి ఆదేశించారు.



# జగన్ దేవరపల్లి పర్యటన

## భారీగా తరలివచ్చిన అభిమానులు

**కాకినాడ,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):**



కూటమి ప్రభుత్వంలో పొగాకు రైతులు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారంటూ వారి సమస్యలను తెలుసుకునేందుకు జగన్ దేవరపల్లి పర్యటన చేపట్టారు. రైతులను పరామర్శించడంతో పాటు పొగాకు యార్డ్‌ను పరిశీలించారు. అయితే ఈ పర్యటనకు పోలీసులు పలు ఆంక్షలు విధించిన నేపథ్యంలో.. జనసందోహం మాత్రం తగ్గలేదు. బారికేడ్లు, భద్రతా ఏర్పాట్లు, నియంత్రణ చర్యలు ఉన్నప్పటికీ జగన్‌ను చూసేందుకు అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రోడ్ల వెంట, పర్యటన మార్గాల్లో జనం బారులు తీరడం కనిపించింది. ఈ క్రమంలో.. ఓ మహిళ ప్రదర్శించిన ఫొటో అందరి దృష్టిని ఆకర్షించింది. 'ఆంధ్ర రాష్ట్రానికి ఒక్కడే రారాజు' అంటూ జగన్ చిత్రాన్ని చూపించడం సోషల్ మీడియాలోనూ చర్చకు దారితీసింది. చుట్టుపక్కల మహిళలు, కార్యకర్తలు ఆ ఫొటోను పైకి ఎత్తి పట్టుకోగా.. పలువురు ఆ ఫొటోతో సెల్ఫీల కోసం ఎగబడ్డారు. అదే సమయంలో.. రాసిపెట్టుకోండి 2029లో జగనే సీఎం, వైఎస్ జగన్ మా దేవుడు అంటూ కొందరు ఫ్లెక్సీలు ప్రదర్శించారు. జగన్ పర్యటనలపై ప్రభుత్వం గత రెండేళ్లుగా ఆంక్షలు విధిస్తోంది. కేసులు పెడతామని నేతలను, ఆ వైపు వెళ్లనీయకుండా సాధారణ ప్రజలను ఇబ్బంది పెడుతోంది. అదేసమయంలో సరైన భద్రత కల్పించకుండా.. డ్రామాలు ఆడుతోంది. అయితే బారికేడ్లు, ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేసినా ప్రజల అభిమానం మాత్రం తగ్గడం లేదు. రాజకీయంగా చూస్తే.. ప్రతి పర్యటనలోనూ కనిపిస్తున్న జన స్పందన వైఎస్సార్‌సీపీకి బలాన్ని చేకూరుస్తోంది. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. నాయకుడిపై అభిమానం ఉంటే జనాలు స్వచ్ఛందంగా తరలివస్తారనే వాదనకు జగన్ పర్యటనలే ఉదాహరణగా నిలుస్తున్నాయి.



# క్యుములోనింబస్ మేఘాల ప్రభావం

## భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ

హైదరాబాద్,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):

క్యుమిలోనింబస్ మేఘాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాబోయే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశమున్నదని వెల్లడించింది. హైదరాబాద్ సహా 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా కామారెడ్డి, మేడ్చల్-మలాజిగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వెల్లడించింది. హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, నల్లగొండ, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీ అయ్యింది. ఈ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురువొచ్చు. కాగా, గడిచిన 24 గంటల్లో 4 మండలాల్లో 11.56 సెం.మీ నుంచి 20.44 సెం.మీ మధ్య వర్షపాతం నమోదైంది. 6.45 సెం.మీ నుంచి 11.55 సెం.మీ మధ్య 40 మండలాల్లో, 1.56 సెం.మీ నుంచి 6.44 సెం.మీ మధ్య 281 మండలాల్లో వర్షపాతం నమోదైనట్టు వాతావరణ కేంద్రం తెలిపింది. అత్యధికంగా కామారెడ్డి జిల్లా పిట్లంలో 14.11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు పేర్కొంది.

# రాహుల్ గురించి మాట్లాడే అర్హత లేదు

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై సంపత్ విమర్శలు

హైదరాబాద్,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):

బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై ఏఐసీసీ సెక్రెటరీ సంపత్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ డస్ట్ బిన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ టిష్యూ పేపర్ అంటూ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత ప్రవీణ్‌కు ఎక్కడిదని ప్రశ్నించారు. కేసీఆర్ కాళ్లు మొక్కి ఒకే పోస్టులో ఏడు సంవత్సరాలు ఉన్నారని ఆరోపించారు. ప్రవీణ్ కుమార్ జాతి ద్రోహి అని.. బీఎస్పీ పార్టీని కేసీఆర్ కాళ్ల దగ్గర పెట్టారని విమర్శించారు.ఐపీఎస్‌గా చేసిన వారు కూడా ఇలా ప్రవర్తించడం దారుణమని సంపత్ అన్నారు. కల్వకుంట్ల కుటుంబ మాయమాటల మత్తులో ఆర్ఎస్ ప్రవీణ్ ఉన్నారని... ఆ కుటుంబానికి ఊడిగం చేస్తున్నారని దుయ్యబట్టారు. లీగల్ నోటీసులు ఎప్పుడు పంపుతారో హరీశ్ రావుకు తెలియదా?.. అడ్వకేట్ ఉన్నారు కదా అని నోటీసులు పంపిస్తే ఎలా అని ప్రశ్నించారు. క్షుద్రపూజల ఆరోపణలపై హరీశ్ సమాధానం చెప్పాలని.. సమాధానం చెప్పకుండా నోటీసులు పంపడం విడ్డూరమని సంపత్ కుమార్ వ్యాఖ్యానించారు.

# ఎపిఎన్ఆర్టీ కోఆర్డనేటర్ల నియామకం

అమరావతి,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):

ఏపీ ఎన్ఆర్టీ కోఆర్డినేటర్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండో విడత జాబితాలో నియమించింది. రెండో విడతలో 292 మందిని కోఆర్డినేటర్లుగా నియమించింది. ప్రవాసాంధ్రుల అభ్యున్నతికి సంక్షేమం కోసం ఈ నియామకాలు చేపట్టినట్లు ఏపీ ఎన్ఆర్టీ ప్రకటించింది. భారత ఎంబసీలు, స్థానిక ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ స్వచ్ఛంద సేవలు అందించేందుకు కోఆర్డినేటర్లు సహకరిస్తారని తెలిపింది. కొత్తగా కోఆర్డినేటర్లుగా నియమితులైన వారికి ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీ ఎన్ఆర్టీ సొసైటీ ప్రెసిడెంట్ వేమూరి రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

# రౌడీయిజం ప్రదర్శించడమే రాజకీయమా?

## వైసిపి నేతల తీరుపై మండిపడ్డ మంత్రి సుభాష్

అమరావతి,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):

రౌడీయిజాన్ని ప్రదర్శించడం వైసీపీ రాజకీయ సంస్కృతిగా మారిందని ఏపీ మంత్రి వాసంశెట్టి సుభాశ్ మండిపడ్డారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి వాసంశెట్టి సుభాశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ పర్యటనలో గొడ్డలి పార్టీ శ్రేణులు బస్సులు అడ్డుపెట్టి, సైలెన్సర్లు తొలగించి బలప్రదర్శన చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించాయని ధ్వజమెత్తారు. ఈరోజు (బుధవారం) అమరావతి వేదికగా మీడియాతో మంత్రి సుభాశ్ మాట్లాడారు. పొగాకు రైతుల సమస్యలపై మాట్లాడే నైతిక అర్హత జగన్‌కు లేదని చెప్పుకొచ్చారు. వైసీపీ హయాంలో కేవలం 12.9 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు జరిగిందని మంత్రి సుభాశ్ ప్రస్తావించారు. తమ ప్రభుత్వం 28.9 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకును కొనుగోలు చేసి రైతులకు మద్దతుగా నిలిచిందని తెలిపారు. పొగాకు కొనుగోళ్ల ద్వారా రైతులకు సుమారు రూ.270 కోట్ల ఆర్థిక ప్రయోజనాన్ని తమ ప్రభుత్వం కల్పించిందని వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్ ధరల పతనం, యుద్ధ పరిస్థితులు వంటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా తమ ప్రభుత్వం రైతులకు అండగా ఉందని చెప్పుకొచ్చారు. కిలోకు రూ.10 ప్రోత్సాహక సాయం అందిస్తూ తమ ప్రభుత్వం సుమారు రూ.100 కోట్ల భారాన్ని భరిస్తోందని మంత్రి సుభాశ్ తెలిపారు. రైతులకు రూ.50 వేల వరకు వడ్డీలేని రుణాలు అందించే అంశంపై కేంద్రంతో చర్చలు జరుగుతున్నాయని అన్నారు. తమ ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై దృష్టి పెడుతుంటే, జగన్ మాత్రం బలప్రదర్శనలు, రాజకీయ ఆరోపణలకే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. ప్రజా సమస్యల కంటే రాజకీయ ప్రచారానికే గొడ్డలి పార్టీ ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి సుభాశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సీమ తాగునీటి అవసరాలకు శ్రీశైలం నీరు

## 2027 జూన్ వరకు భద్రపరచుకోవాల్సిందే

## నీటిని విడుదల చేసినట్లు వెల్లడించిన మంత్రి నిమ్మల

అమరావతి,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):



రాయలసీమ తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేశామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. బుధవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఎల్‌నినో నేపథ్యంలో 2027 జూన్ వరకు శ్రీశైలం జలాలను తాగునీటి కోసం భద్రపరచుకోవాలని అన్నారు. నేటికి శ్రీశైలం వద్ద ఉన్న 119 టీఎంసీలకు తోడు, రాబోయే 10 రోజులలో మరొక 100 టీఎంసీల వరకు ఇన్ ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్నామన్నారు. కృష్ణా జలాల్లో ఏపీ 63 శాతం వాటాను ప్రథమంగా తాగునీటికే ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. శ్రీశైలం రిజర్వాయర్ నీటిని ఎల్‌నినో దృష్ట్యా ప్రథమ ప్రాధాన్యంగా తాగునీటికి విడుదల చేస్తున్నామని తెలిపారు. హంద్రీనీవా పరిధిలోని రిజర్వాయర్లకు తాగునీటి అవసరాల కోసం 13 టీఎంసీలు అవసరమని మంత్రి వెల్లడించారు. పోతిరెడ్డిపాడు పరిధిలోని రిజర్వాయర్లకు తాగునీటి కోసం10 టీఎంసీలను రేపటి నుంచి విడుదల చేస్తున్నట్లు చెప్పారు. అలాగే, తెలుగుగంగ ద్వారా చెన్నై తాగునీటికై 10 టీఎంసీల నీరు విడుదల చేయాల్సి ఉందన్నారు. నాగార్జున సాగర్, రైట్ కెనాల్, లెఫ్ట్ కెనాల్ పరిధి తాగునీటికి 32 టీఎంసీలు అవసరమన్నారు. వారం, వారం సమీక్ష చేసుకుని ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనే విధంగా వర్షాలు, వరదల ఆధారంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ నీటి భద్రతకు చర్యలు చేపట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు.

# డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం

## ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటు

## విశాఖలో సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి లోకేశ్



విశాఖపట్నం,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):

ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం కావాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం నూతన ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్ నౌ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ సేవలు, సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా విశాఖపట్నం ఆవిర్భవించడాన్ని ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటును అందిస్తోందన్నారు. సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు నాణ్యమైన ఉపాధిని సృష్టించడం, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను అభివృద్ధి చేయడం, ఏపీ యువత ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యేలా చేసే ఒక సంపూర్ణ పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. ఆంధ్రప్రదేశ్ పట్ల ఐబీఎం చూపుతున్న నిరంతర నిబద్ధతను స్వాగతిస్తున్నామని చెప్పారు. ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ కోసం విశాఖపట్నాన్ని భారతదేశంలోని అగ్రగామి కేంద్రాలలో ఒకటిగా తీర్చిదిద్దడానికి ఐబీఎంతో కలిసి పనిచేయడానికి ఎదురు చూస్తున్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కన్సల్టింగ్ సేవలు, ఏఐ ఫస్ట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులకు మద్దతుగా ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. భారతదేశ సాంకేతిక ఆవిష్కరణలు, ప్రతిభావంతులైన మానవ వనరుల అభివృద్ధిపై సంస్థ కొనసాగిస్తున్న పెట్టుబడులకు ఇది మరో కీలక ముందడుగు కానుంది. ఈ సెంటర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఖాతాదారులకు కన్సల్టింగ్, సాంకేతిక సేవలను అందించనుంది. ఇందులో కృత్రిమ మేధస్సు, హైబ్రిడ్ క్లౌడ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, డేటా అండ్ అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి కీలక రంగాల్లో సేవలు అందించనున్నారు. అదేవిధంగా ఏఐ ఆధారిత క్లౌడ్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఎ÷-లాట్‌ఫార్మ్ ఇంజనీరింగ్, సర్వీస్ ఇంటిగ్రేషన్, క్వాలిటీ ఇంజనీరింగ్, యూజర్ ఎక్స్‌పీరియన్స్ సేవలకు ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ప్రధాన కేంద్రంగా పనిచేయనుంది.

# కుటుంబ కలహాలతో తండ్రి రాక్షసత్వం

## నాలుగేళ్ల కుమారుడుని బండకేసి కొట్టిన దుర్మార్గుడు

హైదరాబాద్,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):

నగరంలోని గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో కన్న తండ్రి.. నాలుగేళ్ల కుమారుడిపై దారుణంగా దాడి చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. తండ్రి సల్మాన్.. కొడుకు అర్మాన్‌ను ఓ పిల్లర్‌కు బలంగా కొట్టి నేలపై పడేశాడు. అంతటితో ఆగకుండా బాలుడిని లారీ కిందకు నెట్టేందుకు ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు బాలుడిని కాపాడారు. తీవ్రంగా గాయపడిన అర్మాన్‌ను వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గుడిమల్కాపూర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని నిందితుడు సల్మాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. సల్మాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాలే ఈ దారుణానికి కారణమా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసుల విచారణ కొనసాగుతోంది.

# పూర్తికావచ్చిన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి

## తుదిదశకు మూసారాం బాగ్ బ్రిడ్జి పనులు

## పనులను పర్యవేక్షించన మంత్రులు

హైదరాబాద్,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులలో భాగమైన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయని హైదరాబాద్ ఇన్-ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి అజారుద్దీన్‌తో కలిసి నూతనంగా రూపుదిద్దుకున్న సైదాబాద్ స్టీల్ బ్రిడ్జితో పాటు తుది దశకు చేరుకున్న మూసారాంబాగ్ బ్రిడ్జి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా, కాలేరు వెంకటేష్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సుమారు రూ.680 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఆధునిక స్టీల్ బ్రిడ్జి చంచల్‌గూడ జైలు ప్రాంగణం నుంచి ఓవైసీ ఆస్పత్రి వరకు, అలాగే మరోవైపు చంపాపేట వైపు సులభంగా వెళ్లేలా మెరుగైన కనెక్టివిటీని అందిస్తుంది. అతిత్వరలోనే ఈ వంతెనను రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సైదాబాద్, సంతోష్‌నగర్, చంచల్‌గూడ, చంపాపేట తదితర ప్రాంతాల ప్రజలకు సుదీర్ఘకాలంగా వేధిస్తున్న ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం లభించడమే కాకుండా ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. అలాగే మూసారాంబాగ్ వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు సైతం చివరి ఘట్టానికి చేరుకున్నాయని, రాకపోకలకు వీలుగా అప్రోచ్ రోడ్ల విస్తరణను వేగవంతం చేశామని తెలిపారు. నగరంలో నానాటికీ పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చేపట్టిన బ్రిడ్జి పనులతో పాటు పెండింగ్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, ప్రజా రవాణాను మరింత మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రాధాన్యమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఎయిర్‌పోర్టుకు రోడ్డు ఇవ్వొద్దు

## గ్రామస్థుల ధర్నా

ఆదిలాబాద్,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):

ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయనున్న ఎయిర్‌పోర్టు కోసం తమ గ్రామ రోడ్డును తీసుకుంటే మొత్తం గ్రామాన్ని తీసుకోవాలని కోరుతూ అనుకుంటా గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. బుధవారం గ్రామానికి చెందిన రైతులు కలెక్టరేట్‌కు తరలివచ్చి బైఠాయించి నిరసన తెలిపారు.ఎయిర్‌పోర్టు నిర్మాణం వల్ల నష్టపోతున్న తమ భూములకు రూ.6 కోట్లు చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. గ్రామస్థులు ప్రస్తుతం ఆదిలాబాద్ పట్టణానికి చేరుకోవాలంటే కేవలం రెండు కిలోమీటర్ల దూరం మాత్రమే ప్రయాణం చేస్తుండగా రోడ్డు ఎయిర్‌పోర్టులో పోతే 16 కిలోమీటర్లు దూర భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడే అవకాశముందని పేర్కొన్నారు. రోడ్డుతో పాటు తమ గ్రామాన్ని మొత్తం తీసుకొని ఇతర ప్రాంతంలో తమకు పునరావాసం కల్పించాలని కోరారు.

# ఇంటర్ కాలేజీలకు ఎన్‌వోసి తప్పనిసరి

## ఎన్‌వోసిలను పరిశీలించగా నకిలీవని తేలింది

## వీటిపై విచారణ కొనసాగుతుందన్న బోర్డు సెక్రటరీ

హైదరాబాద్,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):

ఇంటర్మీడియట్ కాలేజీలకు ఎన్‌వోసి కంపల్సరీ చేశామని ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డుకు వచ్చిన కొన్ని ఎన్‌వోసి లను హైడ్రాతో సంప్రదించి పరిశీలించగా, కొన్ని సర్టిఫికెట్లు బోగస్‌గా ఉన్నట్లు గుర్తించామన్నారు. హైడ్రాకు వచ్చిన దరఖాస్తుల వివరాలు ఇంటర్మీడియట్ బోర్డుకు అందడంతో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చిందని ఆమె చెప్పారు. ప్రస్తుతం ఫేక్ ఎన్‌వోసిల వ్యవహారంపై విచారణ కొనసాగుతోందని, విచారణ పూర్తయిన తర్వాత ఎన్ని నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారనే విషయం స్పష్టమవుతుందని తెలిపారు.నకిలీ ఎన్‌వోసి ల విషయంలో హైడ్రా, ఇంటర్మీడియట్ బోర్డు సీరియస్‌గా ఉన్నాయని అభిలాష అభినవ్ వెల్లడించారు. ఈ వ్యవహారంపై ఇంటర్మీడియట్ బోర్డు స్థాయిలో అంతర్గత విచారణ కూడా చేపడుతున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీలపై తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఫేక్ ఎన్‌వోసి ల వ్యవహారంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అభిలాష అభినవ్ తెలిపారు. కాలేజీల అనుమతులకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు ఏవైనా సందేహాలు ఉంటే వెబ్‌సైట్ ద్వారా తనిఖీ చేసుకోవచ్చని సూచించారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 3 వేలకుపైగా ఇంటర్మీడియట్ కాలేజీలు అనుమతులు పొందినట్లు ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ తెలిపారు.

# కృష్ణానదికి పెరుగుతున్న వరద ప్రవాహం

నారాయణపేట,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి భారీ వర్షాల కారణంగా కృష్ణానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా కృష్ణ నదిపై నిర్మించిన గుర్జాపూర్, యాదగిరి జిల్లా గూడూరు భీమా నదిపై ఉన్న గుగ్గల్ బ్యారేజీకి వరద నీరు పోటెత్తడంతో ఈ బ్యారేజీ 40 గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద జలాలు తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టు కు చేరుతుండటంతో నది పరివాహక ప్రాంతం జలకళను సంతరించుకుంది. నది పూర్తిగా నీటితో నిండిపోవడంతో తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని కృష్ణ బ్రిడ్జి కింద ప్రవహిస్తున్న వరద ప్రవాహం ఆహ్లాదకర దృశ్యాన్ని తలపిస్తోంది. ఈ దృశ్యాన్ని చూసేందుకు స్థానికులతో పాటు ప్రయాణికులు కూడా బ్రిడ్జి వద్దకు చేరుకుని ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నారు. కృష్ణానదిలో ప్రవాహం రోజురోజుకు వరద ప్రవాహం పెరుగుతుందడడంతో జూరాల ప్రాజెక్టు అధికారులు ఎప్పటి కప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, వరద ఉధృతి కారణంగా నదిలో స్నానాలు చేయకుండా, చేపల వేటకు వెళ్లకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం

## గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

జగిత్యాల,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉందని విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అన్నారు. జగిత్యాల జిల్లా కోరుట్లలోని ప్రభుత్వ బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలతో పాటూ మండలంలోని మాదాపూర్, మోహన్ రావు పేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఎమ్మెల్యే బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కుంటున్న సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.విద్యాసంస్థల్లో తరగతి గదులు, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల బోధన విధానంపై ఆరా తీశారు. మాదాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలతో కలిసి ఎమ్మెల్యే మధ్యాహ్న భోజనం చేశారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థులే దేశ భవిష్యత్ నిర్ణేతలని కష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉన్న ఊరికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చదువుపై ధ్యాస ఉంచాలని పిలుపునిచ్చారు. ఉన్నత లక్ష్యాన్ని ఏర్పర్చుకొని మంచి సాధనతో చదువుల్లో రాణించాలని పేర్కొన్నారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కష్టాన్ని వమ్ము చేయకుండా క్రమశిక్షణతో చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని చెప్పారు. ఏ సమస్య ఉన్న నిర్భయంగా ఉపాధ్యాయుల దృష్టికి తీసుకు వెళ్లాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా పనిచేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన, నాణ్యతో కూడిన భోజనం, మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల బరోసా కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, బీఆర్ఎస్ నాయకులు పొట్ట సురేందర్, జాల వినోద్ కుమార్, సజ్జు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దుచేసే కుట్ర

## గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఎపికి అనుకూల నిర్ణయాలు

### 18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి హరీష్ రావు



హైదరాబాద్,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):

ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు లభించిన తర్వాత వాటిని సమీక్షించి రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో సాధించిన తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే దిశగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఒక ఉద్యమకారుడిగా ఈ పరిణామాలను చూస్తుంటే తనకు కడుపు రగులుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలనే ధైర్యం ఏపీకి ఎక్కడిదని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే, జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టాడు.కాళేశ్వరం, సీతారామ లాంటి 7 ప్రాజెక్టులు రద్దు చేయండి.. తెలంగాణ నోటికాడ ముక్క లాక్కొండని ప్రతిపాదించారు. దీన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నారు. ఈనెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం అజెండాపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని జిఆర్ఎంబి సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఏపీ కోసమే అజెండా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఆర్ఎంబీలో రెండు రాష్ట్రాలుంటాయి. కేందప్రభుత్వం చైర్మన్‌గా ఉంటే.. ఓవైపు తెలంగాణ ఇంజనీర్లు, మరోవైపు ఏపీ ఇంజనీర్లు ఉంటారు.. జీఆర్ఎంబీలో ఈ ఎజెండా తయారవుతుంటే తెలంగాణ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవేళ తెలంగాణ ఇంజనీర్లు రేవంత్ రెడ్డికి చెప్పినా ఆయన పట్టించుకోలేదా..? అసలు ఈ ఎజెండా ఎట్లా వచ్చింది. ఇచ్చిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడిగే ధైర్యం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడిది. ఇది ఎజెండాలో పెట్టే జీఆర్ఎంబీకి ఎక్కడిది..? అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ అంటే ఎట్లా కనబడుతుంది మీకు. త్యాగాల పునాదుల మీద, పోరాటాల మీద సాధించుకున్న ఈ తెలంగాణ నీళ్ల కోసం జరిగిన ఈ ఉద్యమంలో కేసీఆర్ కష్టపడి 383 టీఎంసీల గోదావరి జలాలను మేం అనుమతులు తెచ్చినమన్నారు. తెచ్చిన అనుమతులు రద్దయితయా..? అని హరీశ్ రావు అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 ఏండ్లలో ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతి తేలేదు.. ఒక్క టీఎంసీకి కూడా మీకు క్లియరెన్స్‌లు తేలేదు. మీరొచ్చిన తర్వాత డీపీఆర్‌లు రిటర్న్ వచ్చినయి. సమ్మక్క బ్యారేజ్, పాలమూరు ఎత్తిపోతల పథకం డీపీఆర్ రిటర్న్ వచ్చింది. వార్ధా డీపీఆర్ రిటర్న్ వచ్చింది ఒక్కో ప్రాజెక్టు వాపసు వస్తున్నాయి. పైగా బీఆర్ఎస్ తెచ్చిన అనుమతులు రద్దు చేయాలనే ఎజెండా వచ్చింది. ఎంత చేతకాని దద్దమ్మ ప్రభుత్వం ఇదని హరీశ్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 ఆగస్టు 25న ఎంతో కష్టపడి సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు సాధించిందని హరీశ్ రావు గుర్తుచేశారు. అయితే ఇప్పుడు ఆ సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఉరి వేసేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా 47 టీఎంసీల సమ్మక్క సాగర్ ప్రాజెక్టును వదులుకోవాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, తెలంగాణ ప్రభుత్వం దానికి అంగీకరించిందన్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నీళ్లు వాస్తవానికి ప్రస్తుత ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్ నగర్‌కు వెళ్తాయని, అయినా కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండి పడ్డారు. తాము ఈ అంశాన్ని లేవనెత్తిన రెండు రోజులకే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయడం వారి దివాలాకోరుతనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన ఏడు అనుమతులను రివ్యూ చేస్తామని కేంద్రం చెబుతున్నప్పటికీ బీజేపీ నేతలు ఏమాత్రం స్పందించకపోవడాన్ని హరీశ్‌రావు తప్పుబట్టారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి భయపడి కేంద్ర మంత్రులు పెదవులు మూసుకుంటున్నారని, దీనిపై బీజేపీ వెంటనే స్పందించకపోతే తెలంగాణ ప్రయోజనాల కోసం మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. తెలంగాణలో ప్రస్తుతం చంద్రబాబు బంటు ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టే జీఆర్ఎంబీ అజెండాలో ఇలాంటి ప్రతిపాదనలు వస్తున్నాయని, ఒకవేళ కేసీఆర్ సీఎంగా ఉంటే ఆంధ్రప్రదేశ్ లేదా కేంద్రానికి ఇంత ధైర్యం వచ్చేదా అని ప్రశ్నించారు. ఏపీ మూలాలు ఉన్న అధికారులు తెలంగాణ ఇరిగేషన్ శాఖలో బాధ్యతలు వహిస్తుండటం వల్లే ఇలా జరుగుతోందని ఆరోపించారు. జీఆర్ఎంబీ సమావేశ అజెండా నుంచి గోదావరి, బనకచర్ల అంశాలను తొలగించాలని, ఈ అజెండాను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై పార్లమెంట్‌లో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు గళం విప్పాలని కోరారు. ఇరిగేషన్ విషయంలో ప్రభుత్వం రిట్, సూట్ పిటిషన్ల పేరుతో ఏడాది కాలంగా సమయం వృథా చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి లోపాయికారీ ఒప్పందాలతో గోదావరి, బనకచర్ల ప్రాజెక్టులకు ఒప్పుకున్నారని ఆరోపించారు. గోదావరి జలాల్లో తెలంగాణకు చట్టబద్ధంగా 960 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నప్పటికీ, రాష్ట్ర హక్కులు కాలరాస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తూ బొమ్మలాగా కూర్చున్నారని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాలేదని హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. తెలంగాణకు తాగు, సాగునీరు దూరం చేసే కుట్ర జరుగుతోందని హరీశ్ ఆరోపించారు. రాష్ట్రానికి ద్రోహం జరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. గురు దక్షిణ చెల్లించడం కోసం రేవంత్ మౌనంగా ఉన్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో చేతగాని ప్రభుత్వం ఉందని విమర్శించారు. నీటి విషయంలో అన్యాయం జరిగితే తెలంగాణ ఊరుకోదని హెచ్చరించారు. కాళేశ్వరం అనుమతులు రద్దు చేయడమంటే సగం తెలంగాణకు అన్యాయం చేయడమే అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాలను కూడా సరిగా వాడటం లేదని మాజీ మంత్రి విమర్శించారు. గోదావరిపై ఉన్న నీళ్లను ఎత్తిపోయడం లేదన్నారు. తెచ్చిన అనుమతులు కూడా ఇప్పుడు రద్దయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. సమ్మక్క బ్యారేజీకి అనుమతి ఇవ్వొద్దని ఏపీ చెబితే ఉళీఓఃలో పెట్టారని మండిపడ్డారు. బనకచర్ల, మల్లన్నసాగర్ కడతారు కానీ.. సమ్మక్క బ్యారేజీ ఎందుకు వద్దని హరీశ్ రావు ప్రశ్నించారు.

# దుబాయ్‌లో పాతబస్తీ యువతి మిస్సింగ్

## నాలుగు నెలలుగా సమాచారం లేక ఆందోళన

### శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు

హైదరాబాద్,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):

దుబాయ్‌లో హైదరాబాద్ యువతి మిస్సింగ్ కలకలం రేపుతోంది. గత కొద్ది నెలలుగా ఆమె నుంచి ఎటువంటి ఫోన్ కాల్స్ కానీ.. సమాచారం కానీ లేకపోవడంతో ఆందోళన చెందిన ఆమె కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీకి చెందిన ఓ కుటుంబ పెద్ద మృతిచెందడంతో ఆ కుటుంబం ఆర్థికంగా బాగా చితికిపోయింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తన కుటుంబాన్ని పోషించేందుకు వైద్య విద్య పూర్తి చేసిన ఓ యువతి (24) ఉపాధి కోసం దుబాయ్‌కు వెళ్లింది. గత ఏడాది ఆగస్టులో దుబాయ్‌కు వెళ్లిన ఆమె అక్కడి ఓ ఆస్పత్రిలో విధుల్లో చేరింది. దుబాయ్ వెళ్లిన తర్వాత సదరు యువతి కొంతకాలం పాటు కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడేది. అయితే గత నాలుగు నెలలుగా ఆమె నుంచి ఎటువంటి సమాచారం లేదు. ఆమె రెండు ఫోన్లకు కాల్ చేసినా పనిచేయడం లేదు. దీంతో కంగారుపడిపోయిన కుటుంబసభ్యులు దుబాయ్‌లో ఉన్న తెలిసి వారి ద్వారా ఆరా తీశారు. అయినప్పటికీ యువతి ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలోనే యువతి కుటుంబసభ్యులు శంషాబాద్‌లోని ఆర్జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

## నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ

### 8 ఇంటర్ కాలేజీలపై చర్యలకు ఆదేశం

హైదరాబాద్,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):



హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. దాదాపు ఎనిమిది ప్రైవేటు కాలేజీలు.. రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేశాయి. హైడ్రా పేరును దుర్వినియోగం చేస్తూ నకిలీ ఫ్లైర్ ఎన్వోసీలను సృష్టించిన కళాశాలలు.. వాటిని ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించాయి. ఈ విషయం గుర్తించిన అధికారులు దీనిపై విచారణ చేపట్టగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ చేసినట్లు నిర్ధారించారు. దీంతో నకిలీ పత్రాలు సమర్పించిన ఎనిమిది ప్రైవేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఈ ఘటనపై లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఫోర్జరీ, నకిలీ పత్రాల సృష్టి తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హైడ్రా పేరుతో నకిలీ ఫైర్ నో అ÷–జబెక్షన్ సర్టిఫికెట్లు సృష్టించి ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు గుర్తించిన అధికారులు 8 ప్రైవేటు జూనియర్ కాలేజీలపై కేసు నమోదు చేశారు.ఈ పత్రాల ఆధారంగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు ఫిర్యాదు చేయడంతో లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో తెల్లాపూర్, చిక్కడపల్లి, ఎస్ఆర్ నగర్, మెహిదీపట్నం, బర్కత్‌పురా ప్రాంతంలోని 8 ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఈ ఫోర్జరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆయా కాలేజీ గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఇదే తరహాలో సమర్పించిన మరో 60 ప్రైవేటు కాలేజీ ఫైర్ ఎన్ఓసీలను కూడా అధికారులు స్క్రూటినీ చేస్తున్నారు. వాటి ప్రామాణికతపై విచారణ కొనసాగుతోందని, దర్యాప్తులో మరిన్ని అక్రమాలకు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# గోదావరి వరదలకు చెక్ పెట్టేందకు నిర్ణయం

## వరదల నుంచి రక్షణకు కరకట్ట నిర్మాణం

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):

ప్రతి ఏడాది గోదావరి వరదలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల ప్రజలకు శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గోదావరి వరదల నుంచి మండలంలోని పలు గ్రామాలను రక్షించేందుకు కరకట్ట నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తొలి దశలో సుమారు 270 నుంచి 300 ఎకరాల భూసేకరణ చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. సంజీవరెడ్డిపాలెం నుంచి బూర్గంపహాడ్ మీదుగా నాగినేనిప్రోలు రెడ్డిపాలెం వరకు 17 మీటర్ల ఎత్తుతో, 12 కిలోమీటర్ల పొడవున కరకట్ట నిర్మించనున్నారు. భూమి అడుగు భాగంలో సుమారు 180 మీటర్ల వెడల్పుతో, పైభాగంలో ఐదు మీటర్ల వెడల్పుతో ఈ రక్షణ గోడను నిర్మించనున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. కరకట్ట నిర్మాణంతో పాటు మండలంలో వర్షపు నీరు గోదావరిలోకి వెళ్లేలా రెండు పంప్‌హౌస్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు. నాగినేనిప్రోలు రెడ్డిపాలెం సమీపంలోని పెదవాగు నుంచి ప్రారంభమయ్యే కరకట్ట, సంజీవరెడ్డిపాలెం సమీపంలోని దోమలవాగు వరకు నిర్మించనున్నారు. కరకట్ట నిర్మాణంతో సంజీవరెడ్డిపాలెం, బూర్గంపహాడ్, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామాలతో పాటు మండల కేంద్రానికి గోదావరి, కిన్నెరసాని వరదల ముప్పు నుంచి రక్షణ లభించనుంది. ప్రతి ఏడాది వరదల కారణంగా పంటలు, ఇళ్లు ముంపునకు గురవడం, ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలిపోవాల్సిన పరిస్థితికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.కరకట్ట నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం ఇప్పటికే భద్రాచలం సబ్‌కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వారంలోపు భూసేకరణ సర్వే పనులు ప్రారంభిస్తామని నీటిపారుదల శాఖ ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. తొలి దశలో 270 నుంచి 300 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు వెల్లడించారు. వారం రోజుల్లో భూసేకరణకు పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

# విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

## బడ్జెట్ కేటాయింపులే నిదర్శనం

### బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశిపతి శ్రీనివాస్

హైదరాబాద్,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అత్యంత తక్కువ నిధులు కేటాయించి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఆరోపించారు. 2024–25 బడ్జెట్‌లో మొత్తం వ్యయంలో విద్యారంగానికి కేవలం 5.98 శాతం మాత్రమే కేటాయించడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. గత 6–7 ఏళ్ల తెలంగాణ బడ్జెట్‌లను పరిశీలిస్తే విద్యారంగానికి ఇంత తక్కువ శాతం నిధులు కేటాయించడం ఇదే తొలిసారని దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజ్ఞాన గనిగా మారాల్చిన తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం అంధకారంలోకి నెట్టాలని చూస్తోందని ఆరోపించారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్దే ఉంచుకున్నప్పటికీ, ఆ శాఖకు తగిన నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తారని భావిస్తే, బ్జడెట్‌లో కేవలం 5.98 శాతానికే పరిమితం చేయడం దురదృష్టకరమని అన్నారు. నిధుల కొరత కారణంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, విశ్వవిద్యా లయాలు మౌలిక వసతుల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని దేశపతి శ్రీనివాస్ తెలిపారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు, రాష్ట్ర విద్యా వ్యవస్థ పునాదులు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.తెలంగాణ సమాజం విద్యావంతం కావడం, పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇష్టం లేదా అని ఆయన ప్రశ్నించారు. తక్షణమే విద్యారంగానికి కేటాయింపు లను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# సిఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన

## షరతులతో అనుమతిచ్చిన ఎసిబి కోర్టు

హైదరాబాద్,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):

సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం, ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించేందుకు అనుమతించింది. ఇందుకోసం కోర్టు కస్టడీలో ఉన్న ఆయన పాస్‌పోర్టులను తాత్కాలికంగా విడుదల చేయాలని ఆదేశించింది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంతో విదేశీ పర్యటన చేపడుతున్నట్లు రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పాస్‌పోర్టులను తాత్కాలిక కస్టడీకి ఇవ్వడంతో పాటు విదేశీ ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు పిటిషన్‌ను పాక్షికంగా అనుమతించింది. విదేశీ పర్యటనకు అనుమతి ఇస్తూనే కోర్టు పలు షరతులు విధించింది. లక్ష వ్యక్తిగత బాండ్‌తో పాటు ఒక ష్యూరిటీ సమర్పించాలని ఆదేశించింది. విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి ప్రయాణ వివరాలు, అక్కడ బస చేసే చిరునామాలు, సంప్రదింపు ఫోన్ నంబర్లు కోర్టుకు అందజేయాలని పేర్కొంది. అలాగే, సెప్టెంబర్ 18లోగా పాస్‌పోర్టులను తిరిగి కోర్టులో జమ చేస్తానని అఫిడవిట్ దాఖలు చేయాలని రేవంత్ రెడ్డిని ఆదేశించింది. ఆ అఫిడవిట్ సమర్పించిన అనంతరం ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారికి లేఖ రాసి పాస్‌పోర్టులను తాత్కాలికంగా అప్పగించాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది.

# తెలంగాణలో డయల్ 112 సేవలు ప్రారంభం

## పోలీస్,ఫైర్, అంబులెన్స్‌కు ఇక ఒక్కటే నంబర్-సేవలను ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్

హైదరాబాద్,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):

తెలంగాణలో డయల్ 112 సేవలు అందుబాటగులోకి వచ్చాయి. ఏ ఫిర్యాదుకైనా ఇక 112 ద్వారా సమాధానం వస్తుంది. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. డయల్ 112 ద్వారా 18 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. న్యాయసాయం, వైద్యసాయం, సైబర్‌సాయం అనేక సమస్యల పరిష్కారాలకు డయల్ 112 పరిష్కార మార్గమని వ్యాఖ్యానించారు. డయల్ 112కు ఫోన్ చేసినప్పుడు పోలీసులు దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించడానికి వీల్లేదని స్పష్టం చేశారు.ఒకే వ్యవస్థలోకి పోలీస్, ఫైర్, అంబులెన్స్ సేవలు, టిజిఐసిసి నుంచి డయల్ 112 సేవలను పర్యవేక్షి స్తామని డీజీపీ తెలిపారు. ప్రజల భద్రత, అత్యవసర స్పందన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. డయల్ 112 ఫోన్ రాగానే కాలర్ లొకేషన్ కోసం అడ్వాన్స్ ఆల్స్ వాడుతున్నామని పేర్కొన్నారు. డ్రోన్ బెస్ట్ టెక్నికల్ సిస్టంను త్వరలోనే తెలంగాణ పోలీసులు ఉపయోగిస్తారని వివరించారు. డ్రోన్ టీమ్‌ను సైతం ఏర్పాటు చేయబోతున్నామని చెప్పుకొచ్చారు. డయల్ 112 అనేది 3.0 వర్షన్‌గా ఉంటుందని తెలిపారు. యువ ఏపీఎస్‌లు, ఏఐ టెక్నాలజీ వాడే వారిని ఇందులో భాగస్వామ్యం చేయబోతున్నామని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు. బేసిక్ పోలీసింగ్ లాగా టెక్నాలజీ పోలీసింగ్‌ను అమల్లోకి తీసుకువస్తున్నామని వ్యాఖ్యానించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ టవర్‌లో రెండు ఫ్లోర్‌లను డయల్ 112కి కేటాయించామని తెలిపారు. డయల్ 100ను 2013లో కొంపల్లిలో జివికె వారి సాయంతో ప్రారంభించామని ప్రస్తావించారు. వివిధ అత్యవసరాలకు ఒకే నంబర్ ఉండాలని గతంలో కేందప్రభుత్వం సూచించిందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టెక్నికల్ డెవలప్‌మెంట్ చేస్తూ వచ్చామని అన్నారు. ఇటీవల ఏఐ వచ్చాక అనేక పనులు సులువుగా అయిపోతున్నాయని డీజీపీ ఆనంద్ వెల్లడించారు.




# యాద్గిర్ జిల్లా రసాయన పరిశ్రమలో ప్రమాదం

## ముగ్గురు యువకుల దుర్మరణం

### ఒకరు నారాయణపేట జిల్లా వ్యక్తిగా గుర్తింపు

రాయచూర్,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):

కర్ణాటక యాద్గిర్ జిల్లాలోని ఓ రసాయన పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తెలంగాణ యువకుడు సహ ముగ్గురు యువకులు మరణించారు. మరో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. విషవాయువులు విడుదల కావడంతో బుధవారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి 2 గంటల మధ్యలో ఈ ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలోని విషవాయువులు లీకవ్వడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. విషవాయువులు లీకవ్వడంతో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఐదుగురు కార్మికులు ఒక్కసారిగా అస్వస్థతకు గురవ్వడంతో వారిని రాయచూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)కు తరలించారు. అయితే అప్పటికే ముగ్గురు మృతిచెందినట్లుగా వైద్యులు గుర్తించారు. మృతులను తెలంగాణలోని నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ఆలంపల్లికి చెందిన గణెశిశ్, మధ్యప్రదేశ్‌లోని కట్నీ జిల్లాకు చెందిన విక్రమ్, సంజయ్‌లుగా గుర్తించారు. వీరంతా 20 నుంచి 25 ఏళ్లలోపు వారేనని అధికారులు తెలిపారు. ఇక ఈ ఘటనలో ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన హేమంత్, శివకుమార్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంపై సమాచారం అందుకున్న యాద్గిర్ జిల్లా ఎస్పీ పృథ్వీక్ శంకర్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై దర్యాప్తు చేపట్టారు.

# ఇంటిని కూల్చి రోడ్డున పడేశారు

## రామగుండం కార్పొరేషన్ ముందు కుటుంబం ఆందోళన

**రామగుండం,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):**

20 ఏండ్ల నాటి ఇంటిని ఎందుకు కూల్చారని రెండు రోజులుగా అన్నపానీయాలు లేకుండా న్యాయం కోసం బల్దియా మెట్లు ఎక్కితే ఒక్కరూ పట్టించుకోవడం లేదని బాధిత కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక మాకు దిక్కెవరని, మాకు న్యాయం జరగదా..? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి నుంచి వచ్చేసరికి ఇంటిని కూల్చివేశారని బాధిత కుటుంబం బుధవారం గోడు వెల్లబోసుకుంది. ఈ మేరకు రెండో రోజు రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగం ఎదుట సుమారు నాలుగు గంటల పాటు నిరసన తెలిపారు. గర పాలక సంస్థ 21వ డివిజన్ పరిధిలోని ఎల్కలపల్లి గేట్‌లో మానుగు లిఖిత అనే మహిళ నివాసం ఉంటుంది. తన ఇంటిని నెల రోజుల క్రితం మున్సిపల్ అధికారులు వచ్చి కూల్చివేశారని ఆరోపిస్తూ తన అత్తమామలు, ఆడబిడ్డ, చంటి పిల్లలతో కలిసి మున్సిపల్ ఆఫీసు ఎదుట మంగళవారం రోజంతా బైఠాయించిన సంగతి విషయం తెలిసిందే. రెండో రోజు బుధవారం కూడా కుటుంబ సభ్యులతో కార్యాలయానికి చేరుకొని టౌన్ ఎ÷-లానింగ్ విభాగం చాంబర్ ఎదుట న్యాయం కోసం అధికారులను ప్రాధేయపడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ తాము ఇంట్లో లేని సమయంలో మున్సిపల్ సిబ్బంది వచ్చి ఇంటిని కూల్చివేశారని, ఆ సమయంలో ఇంటిలో విలువైన బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులు ఉన్నాయని వాపోయారు. 20 ఏండ్ల నుంచి ఉంటున్న ఇంటిని కూల్చివేయడానికి గల కారణాలు అడిగితే.. పై అధికారుల నుంచి ఆర్డర్ అని అంటున్నారని పేర్కొన్నారు. తమకు ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదని వాపోయారు. కూల్చిన ఇంటికి నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తం: ఏసిపి

**కరీంనగర్,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):**

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని ఏసీపీ విజయ్ కుమార్ ప్రజలకు సూచించారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంకేంద్రంలో బుధవారం ఎస్ఐ నరేందర్ రెడ్డితో కలసి సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ విజయ్ కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలు బాగా పెరిగాయని, ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వాట్సప్‌లో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయొద్దని అన్నారు. ప్రజల బలహీనతలే సైబర్ నేరగాళ్లకు బలంగా మారిందన్నారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అదేవిధంగా శాంతి భద్రతలకు ఎవరైనా ఆటంక కలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో మంగళవారం నమోదు అయిన ఎస్సీ, ఎస్టీ కేసు పై విచారణ చేపట్టారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

**భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):**

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన కొమరం రాంగోపాల్(24) ఇదే గ్రామానికి చెందిన మరో యువకుడు పూనెం సందీప్ ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై మంగళవారం అర్ధరాత్రి మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్దకు వచ్చి క్యానులో డిజిల్ నింపుకుని తిరిగి వెళ్తున్నారు. మార్గం మధ్యలో బైక్ వెనుక కూర్చున్న రాంగోపాల్ క్యాన్ జారిపోవడంతో కిందకి దిగాడు. అదే సమయంలో వేగంగా వస్తున్న గుర్తు తెలియని వాహనం వెనుక నుండి బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. వెంటనే సందీప్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించి 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి క్షతగాత్రుడిని తరలించారు. బుధవారం ఉదయం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో రాంగోపాల్ యువకుడు మృతి చెందాడు. అందరితో కలివిడిగా ఉండే యువకుడి అకాల మరణంతో గ్రామంలో విషాధ ఛాయలు అలుముకున్నాయి. రాంగోపాల్ అన్నయ్య కొమరం సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పీవీ నాగేశ్వరరావు తెలిపారు. కాగా గుర్తు తెలియని వాహనాన్ని వెంటనే గుర్తించి వారిపై చర్యలు చేపట్టాలని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. చేతికి అందిన కుమారుడు తమకు చేదోడువాదోడుగా ఉండే సమయంలో ప్రమాదంలో అకాల మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

# కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలపై పోరు

## 10న జైల్ భరోస

## కార్యాక్రమానికి పిలుపు

**భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశంఖం పూరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు భూక్యా రమేశ్ పిలుపునిచ్చారు. జూలూరుపాడు మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో మండల సదస్సు జరిగింది. ఈ సదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాసా నరేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని తీవ్రంగా విమర్శించారు. ప్రజల ఓట్లతో గెలిచి ప్రజా సంపదను దోచుకుంటూ, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను రద్దు చేసిందన్నారు. వెంటనే పత్తి, మొక్కజొన్న, పాడి ఉత్పత్తులు దిగుమతి ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం కొత్తగా తెచ్చిన విబి జి రామ్ జీ విధానాలను, నూతన విత్తన చట్టం, విద్యుత్ సవరణ చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త 'జైల్ భరో' ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, నిరసనకారులతో పోలీస్ స్టేషన్లు, జైళ్లు నిండాలని కోరారు. ఈ సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పద్దం సుగుణ, రాచబంటి కోటేశ్వరరావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ, సిఐటియు మండల కన్వీనర్ బోడ అభిమిత్ర, రైతు సంఘం మండల నాయకులు మాలోత్ రాములు, బానోత్ ఈశ్వర్, ధరావత్ రమేష్, గార్లపాటి వెంకటి, ఇల్లంగి సీతారాములు, బానోత్ రూపా పాల్గొన్నారు.

# ఎల్ఐసిలో డిజిన్వెస్టిమెంట్ తగదు

## నల్లగొండ బ్రాంచ్ వద్ద ఉద్యోగుల నిరసన

**నల్లగొండ,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):**

భారత జీవిత బీమా సంస్థలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న మరింత వాటాల ఉపసంహరణ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం నల్లగొండ బ్రాంచ్ 1, 2 కార్యాలయాల వద్ద ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంఎ÷-లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ 1, 2 అధ్యక్ష, కార్యదర్శులు కొప్పు వెంకన్న, ఏ.కరుణాకర్ రావు, ఐ.లక్ష్మీనారాయణ, సి.హెచ్.రమేష్, ఏజెంట్ల యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఈ నెల 3న ప్రకటించిన ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ఎల్ఐసిలో మరో 2.5 శాతం నుండి 6.5 శాతం వరకు వాటాలను విక్రయించాలని ప్రభుత్వం చూడడం దారుణమన్నారు. మే 2022లో ఐపీవో ద్వారా ఉపసంహరించిన 3.5 శాతానికి అదనంగా మళ్లీ ప్రజల ఆస్తిని మార్కెట్‌కు కట్టబెట్టడం దేశ ప్రయోజనాలకు విఘాతమని ఆందోళన వ్యక్తం చేశారు. కోట్లాది మంది పాలసీదారుల నమ్మకంతో నిర్మితమైన ఎల్ఐసి కేవలం లాభాలు తెచ్చే సంస్థ మాత్రమే కాదని, దేశ ఆర్థిక రక్షణకు, అభివృద్ధికి వెన్నుముకగా నిలుస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని, ఎల్ఐసి ప్రభుత్వ రంగ స్వభావాన్ని కాపాడుకునేందుకు కార్మికులు, ప్రజాస్వామ్యవాదులు, పాలసీదారులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఏజెంట్ల యూనియన్ నాయకులు బి.రామలింగం, నలపరాజు సైదులు, దారం వెంకన్న, ఇటికాల ఉపేందర్, దేశగాని కృష్ణ, విజయ్ కుమార్ తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆయా బ్రాంచ్‌ల ఐసిఈయు నాయకులుపాల్గొన్నారు.

# ఉపాధి పథకం కింద పలు నిర్మాణాలు

## శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**నల్లగొండ,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):**

దేవరకొండ మండలం గొల్లపల్లి గ్రామంలో రూ.25 లక్షలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ బుధవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో వీబీ రామ్ జీ నిధుల ద్వారా రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు అలాగే రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు విన్నవించిన పలు సమస్యలపై ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని, ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ కో ఆర్డినేటర్ ఎంఏ సిరాజ్ ఖాన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మారుపాకుల సురేష్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు లోకసాని శ్రీధర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ గందు రవి, ఉపసర్పంచ్ దొంతినేని జానకిరామారావు, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు కొర్ర రాంసింగ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, తాటికోల్ సర్పంచ్ చల్లమల విజయ్, పరిసర గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

## కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

**కామారెడ్డి,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):**

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి అని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్షా తిరంగా సైబర్ స్వతంత్ర తెలంగాణ' రాష్ట్రవ్యాప్త సైబర్ అవగాహన కార్యక్రమాన్ని భిక్కనూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుతం స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్, ఫేక్ లింకులు, ఓటీపీ, కేవైసీ అప్‌డేట్, డిజిటల్ అరెస్ట్, నకిలీ కస్టమర్ కేర్ కాల్స్ వంటి సైబర్ మోసాలు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కృత్రిమ మేధస్సు దుర్వినియోగంతో డీప్‌ఫేక్ వీడియోలు, నకిలీ వాయిస్ కాల్స్, తప్పుడు సందేశాలు, నకిలీ సోషల్ మీడియా ఖాతాల ద్వారా మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థులు, యువత, సోషల్ మీడియా వినియోగదారులు అపరిచితుల నుంచి వచ్చే లింకులు, ఉద్యోగాలు, పెట్టుబడి ప్రకటనలను ధృవీకరించకుండా నమ్మవద్దని, వ్యక్తిగత సమాచారం, ఓటీపీ, ఏటీఎం పిన్, బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.ఆగస్టు నెలంతా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, మహిళా సంఘాలు తదితర ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ, భిక్కనూరు సీఐ, ఎస్ఐలు, సైబర్ క్రైమ్ అధికారులు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




# సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తం కావాలి

## వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత

**హనుమకొండ,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):**

రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. సైబర్ నేరస్థులు ప్రధానంగా భయం, ఆశ, అత్యవసరత అనే మూడు భావోద్వేగాలను ఉపయోగించి మోసాలకు పాల్పడతారని, అలాంటి సందేశాలు వచ్చినప్పుడు వెంటనే స్పందించకుండా ధృవీకరించి నిర్ణయం తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు. జాతీయస్థాయి సైబర్ జాగ్రూకత దివస్ కార్యక్రమం, సురక్షా కా తిరంగా -మంత్ ఎండ్ ఛాంపియన్ కార్యక్రమంలో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ)లో, వరంగల్ పోలీస్ కమిషనరేట్ సంయుక్తంగా బుధవారం బోస్ హాల్‌లో సైబర్ జాగ్రూకత దివస్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, నిట్‌లో జరుగుతున్న కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సైబర్ భద్రత పరిశోధనలను ఆమె అభినందించారు. నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ సైబర్ భద్రతపై అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరమని, సైబర్ నేరాల నివారణకు సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో నిట్ త్వరలో సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్ నిర్వహించన్నట్లు చెప్పారు. కృత్రిమ మేధస్సు ఆధారిత సైబర్ భద్రత, డీప్ ఫేక్ గుర్తింపు వంటి రంగాల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో కలిసి పనిచేస్తామన్నారు. రిజిస్ట్రార్ సునీల్ మెహతా, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ దారా కవిత, నిట్ పూర్వ విద్యార్థిని, సైబర్ మోసాల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, 1930 జాతీయ సైబర్ హెల్ప్ లైన్, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ వంటి సేవల గురించి వివరించారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

**నల్లగొండ,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):**

తుంగతుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి ఎస్ఐ క్రాంతికుమార్ మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న సైబర్ నెలలపై విద్యార్థులు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నేటి ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా డిజిటల్ భద్రతా ప్రమాణాలను తెలుసుకోవడం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. విద్యార్థులు ఖచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని గేమ్స్ ఆడేటప్పుడు, ఆన్‌లైన్ టాస్క్‌ల పేరుతో వచ్చే నకిలీ ఆఫర్లను, లాటరీలను నమ్మి మోసపోవద్దని గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయకూడదని తెలిపారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# బిసిల హక్కులకు ప్రత్యేక చట్టం అవసరం

**నల్లగొండ,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):**

బీసీల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని బీసీ ఉద్యోగుల సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్, బీసీ జేఏసీ కన్వీనర్ మారం శ్రీనివాస్, గుడిపాటి కోటయ్య, బీసీ జేఏసీ కో కన్వీనర్ దాసరాజు జయరాజు అన్నారు. ఈ నెల 9న నల్లగొండలో జరుగనున్న బీసీల న్యాయ పోరాట సభ పోస్టర్, కరపత్రంను బుధవారం మిర్యాలగూడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని, జాతీయ కుల గణనలో ప్రతి కులానికి ఒక యూనిక్ నంబర్ కేటాయించాలనే తదితర డిమాండ్లతో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## గోదావరి పుష్కరాలు -2027 ఏర్పాట్లపై సమీక్ష

**ఏలూరు, ఆగష్టు, 5 (నేషనలిస్ట్ వాయిస్) :**

గోదావరి పుష్కరాలు -2027 ఏర్పాట్లపై రాష్ట్ర సచివాలయం నుండి జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశి భూషణ్ కుమార్,గోదావరి పుష్కరాల ప్రత్యేక అధికారి ,వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండ్యన్ లతో కలిసి బుధవారం సంబంధిత శాఖల అధికారులు, ఆయా జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గోదావరి పుష్కరాల సందర్భంగా స్నాన ఘాట్ల ఏర్పాట్లు, ఘాట్లలో మౌలిక సదుపాయాలు, ఆయా ప్రాంతాలలో రోడ్ల అభివృద్ధి, రవాణా, భద్రత, తదితర ఏర్పాట్లకు సంబంధించి వివిధ శాఖల ఉన్నతాధికారులు సమర్పించిన ప్రతిపాదనలపై సమీక్షించారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ గోదావరి పుష్కరాల సందర్భంగా జిల్లాలో 28 స్నాన ఘాట్ల ఏర్పాటుకు గుర్తించామన్నారు. పోలవరం లో 20, కుక్కునూరు లో 3, వేలేరుపాడులో 5 ఘాట్ల ఏర్పాటు, ఆయా ఘాట్లలో మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు.

# ఫామ్ పాండ్ల నిర్మాణంతో రైతులకు మేలు

## పలు గ్రామాల్లో నిర్మాణాలు పరిశీలించిన కలెక్టర్

**కామారెడ్డి,ఆగస్ట్5(నేషనలిస్ట్ వాయిస్):**

గాంధారి మండలంలోని పోతంగల్ కుర్దు, సీతాయిపల్లి గ్రామపంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో అమలు చేస్తున్న ఫామ్ పాండ్ల నిర్మాణాన్ని అన్ని గ్రామపంచాయతీల్లో విస్తృతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో భాగంగా పోతంగల్ కుర్దు గ్రామపంచాయతీలో నిర్మించిన ఫామ్ పాండ్, కొబ్బరి బండ్ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫామ్ పాండ్‌ను వినియోగిస్తున్న రైతుతో మాట్లాడి పథకం వల్ల కలుగుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఫామ్ పాండ్‌లో చేపల పెంపకం ద్వారా ప్రతి సంవత్సరం రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు అదనపు ఆదాయం లభిస్తుందని రైతు కలెక్టర్‌కు తెలిపారు. అలాగే ఫామ్ పాండ్‌లో నిల్వ చేసిన నీటిని సాగునీటిగా వినియోగించడం వల్ల యూరియా వినియోగం గణనీయంగా తగ్గడంతో పాటు పంట దిగుబడి కూడా మెరుగు పడిందని వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, రైతుల ఆదాయ వృద్ధి లక్ష్యంగా పథకం కింద అర్హులైన రైతులను గుర్తించాలని అన్నారు. గాంధారి మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో పెద్ద ఎత్తున ఫామ్ పాండ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు. పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేసి రైతులకు త్వరితగతిన ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీతాయిపల్లి గ్రామపంచాయతీ లో కొనసాగుతున్న భూభారతి రీ-సర్వే పనులను పరిశీలించారు. ప్రస్తుతం బౌండరీ ఫిక్సింగ్ పనులు కొనసాగుతుండగా, ఇప్పటివరకు 11.5 కిలోమీటర్ల బౌండరీ ఫిక్సింగ్ పూర్తయిందని అధికారులు వివరించారు. ఈ పనులను నాణ్యతా ప్రమాణాలతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఐకేపీ కార్యాలయాన్ని సందర్శించి మహిళలు కుడుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్‌లను పరిశీలించారు. యూనిఫామ్‌ల నాణ్యత, కుట్టు పనితీరును పరిశీలించి, నిర్ణీత సమయంలో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ పర్యటనలో కలెక్టర్‌తో ఆర్డీవో మస్తా ప్రభాకర్, సర్పంచ్ సంతోష్, అంజాద్, తహసీల్దార్ రేణుక చౌహాన్, ఎంపీడీవో రాజేశ్వర్, ఏడీ సర్వేయర్ శ్రీనివాస్, ఏపీఎం లక్ష్మి ప్రసన్న, ఏపీవో మధు, టెక్నికల్ అసిస్టెంట్ నరేష్, అధికారులు ఉన్నారు.

# డ్రగ్స్ ఫ్రీ ఇండియా'తోనే యువతకు ఉజ్వల భవిష్యత్

## నిర్మల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో వ్యాసరచన పోటీ నిర్వహణ

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్,నిర్మల్ బ్యూరో, ఆగస్టు 5.**

యువతను మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి దూరంగా ఉంచి ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి దోహదపడే లక్ష్యంతో నిర్మల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం "డ్రగ్స్ ఫ్రీ ఇండియా" అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు.ఈ పోటీలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, యువత పాత్ర, సమాజంలో అవగాహన అవసరం, ఆరోగ్యకరమైన జీవన విధానం, మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి పౌరుడి బాధ్యత వంటి అంశాలపై తమ ఆలోచనలను ప్రతిభావంతంగా వ్యాసాల రూపంలో వ్యక్తం చేశారు. విద్యార్థినుల రచనలు వారి సామాజిక స్పృహ, సృజనాత్మకత, జాతీయ బాధ్యతను ప్రతిబింబించాయని అధ్యాపకులు ప్రశంసించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి జుఫిషాన్ సుల్తానా మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే సామాజిక శాపమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మంచి విలువలను అలవర్చుకుని, "డ్రగ్స్ ఫ్రీ ఇండియా" లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కుటుంబం, విద్యాసంస్థ, సమాజంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కల్పించడంలో యువత ముందుండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉర్దూ లెక్చరర్ మొహమ్మద్ మిన్హాజ్ ఉల్ హక్, తెలుగు లెక్చరర్ జలజా, హిందీ జూనియర్ లెక్చరర్ అనురాధ, సీజీటీ జూనియర్ లెక్చరర్ అంజలి పాల్గొని విద్యార్థినులను అభినందించారు. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకత, సామాజిక బాధ్యత, జాతీయ చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని వారు పేర్కొన్నారు.కార్యక్రమం ముగింపులో విద్యార్థినులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, ఇతరులను కూడా చైతన్యపరిచి మత్తు పదార్థాల రహిత భారతదేశ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.




# కృష్ణవేణి పాఠశాలలో ఘనంగా బోనాల సంబురాలు

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

ఆషాఢమాసం బోనాల పండుగ సంబురాల్లో సందర్భంగా బుధవారం బాల్కొండ మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో అత్యంత వైభవంగా బోనాల పండుగ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమ్మవార్లకు పూజలను నిర్వహించి బోనాలను బాల్కొండ లోని ప్రధాన విధులగుండ ఊరేగించారు.గ్రామంలోని పెద్దపోచమ్మ, మహాలక్ష్మి, ఐదు చేతుల పోచమ్మ,నల్ల పోచమ్మ,పెద్దమ్మ దేవాలయాలకు వెళ్లి పలు రకాల నైవేద్యాలను సమర్పించారు. విద్యార్థులు చేసిన పోతురాజుల విన్యాసం అతిథులను ఆకట్టుకునారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు విఘ్నేశ్వ వార్, ఆకుల లక్ష్మణ్,ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్, ఉపాధ్యబృందం పాల్గొనారు.



# ఎగువ మానేరు ప్రాజెక్టును పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ముస్తాబాద్/ సిరిసిల్ల**

ఎగువ మానేరు ప్రాజెక్ట్ వద్ద నీటి పారుదల, రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఉన్న ఎగువ మానేరు ప్రాజెక్ట్ ను బుధవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం, ఎగువ నుంచి వరద తదితర అంశాలపై జిల్లా నీటి పారుదల శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ఎగువ మానేరు ప్రాజెక్ట్ లోకి ప్రస్తుతం కూడవెల్లి, పాల్వంచ వాగుల నుంచి ఇన్ ఫ్లో లేదని, ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 2 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 1.6 టీఎంసీల నీరు ఉందని నీటి పారుదల శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎగువ మానేరు ప్రాజెక్ట్ లోకి వరద చేరి పూర్తి స్థాయి నీరు నిండే అవకాశం ఉందని, నీటి పారుదల శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి మట్టాన్ని పరిశీలిస్తూ.. ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామాల రైతులు, ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేయాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ మత్తడి పారితే పోలీస్, రెవెన్యూ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి.. రాకపోకలను నియంత్రించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పరిశీలనలో సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, ప్రశాంత్, తహసీల్దార్ మారుతి, సర్పంచ్ అర్చన పాల్గొన్నారు.



# టీబీజీకేఎస్ లో పలువురి చేరిక



**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ప్రతినిధి మందమర్రి**

మందమర్రి సివిల్ డిపార్ట్మెంట్ లో టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ఏరియా వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, గాలిపెల్లి తిరుపతి ఆధ్వర్యంలో సివిల్ డిస్ట్రిబ్యూషన్ డిపార్ట్మెంట్ మెంట్ నుండి 16 మంది కార్మికులు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘంలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా మిర్యాల రాజిరెడ్డి గేట్ మీటింగ్ లో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో కి వచ్చినప్పటి నుండి సింగరేణి సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని. కొత్త గనులు, కొత్త ఉద్యోగాలు లేక కార్మికులు ఆయోమయానికి గురవురవుతున్నారని తెలిపారు. బొగ్గు ఉత్పత్తి చేయకుండానే 40 లక్షల బొగ్గు ఉత్పత్తి జరిగిందని చెప్పడం దేనికి నిదర్శనమో కాంగ్రెస్ ప్రభుత్వం తెలపాలన్నారు. సింగరేణి కార్మికులకు జీతాలు ఇవ్వాలంటే అప్పులు చేసే పరిస్థితి నెలకొందని అన్నారు. ప్రభుత్వాలు కార్మికుల ప్రయోజనాలు పట్టించుకోవడం లేదని సింగరేణిలో కార్మికుల సంఖ్య తగ్గుతున్న కొత్త నియామకాలు జరగడం లేదన్నారు. డిపెండెంట్ ఉద్యోగాలు, ప్రమోషన్లు, బదిలీలు వంటి సమస్యలు పరిష్కారం కావడం లేదని, కార్మికులకు రావాల్సిన సౌకర్యాలు, హక్కులు అమలు కావడం లేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు తగిన వేతనాలు, భద్రతా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధి చెందాలంటే కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకెఎస్ యూనియన్ నాయకులు ఓ రాజశేఖర్, సిహెచ్ వెంకట్ రమణ, బెల్లం అశోక్, కొరబోయన లక్ష్మణ్, బాబు రావు, వీరా రెడ్డి, కొండల్ రావు, సీపెల్లి రాజలింగు, కరుకూరి తిరుపతి, మధుసూదన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, బత్తుల శ్రీనివాస్, ఎండీ అబ్బాస్, కారుకురి రామచందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఆగష్టు 10న టిపిసీసీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో విస్తృత సమావేశం. - టీపీసీసీ వైస్ చైర్మన్ దుర్గం శేఖర్



**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా టీపీసీసీ వైస్ చైర్మన్ దుర్గం శేఖర్,జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం చైర్మన్ కే.పరమేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో ఆగస్టు 10వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటలకు ఆదిలాబాద్ పట్టణంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్లో జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం చైర్మన్,ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ,ఏఐసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ తెలంగాణ ఇన్‌చార్జ్ డా.సిద్ధార్థ హితంబరే,ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సమతా సుదర్శన్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.ఈ విస్తృత సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగాన్ని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం,దళితుల సంక్షేమం,సామాజిక న్యాయం,రాజ్యాంగ పరిరక్షణ,పార్టీ సంస్థాగత నిర్మాణం,ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, రానున్న రాజకీయ కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించడం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాల సాధనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని,దళితుల హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాడుతుందని తెలిపారు.ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఎస్సీ విభాగం జిల్లా కార్యవర్గ సభ్యులు,మండల అధ్యక్షులు,గ్రామ కమిటీ సభ్యులు,ప్రజాప్రతినిధులు,యువజన నాయకులు,మహిళా నాయకులు,దళిత మేధావులు,దళిత సమాజానికి చెందిన ప్రజలందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ విస్తృత సమావేశాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ పార్టీ దళితుల సంక్షేమం,సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.జిల్లా స్థాయి విస్తృత సమావేశం ద్వారా పార్టీ బలోపేతానికి కొత్త దిశ నిర్దేశం అవుతుందని,ప్రతి కార్యకర్త తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం నాయకులు,ప్రధాన కార్యదర్శులు మంథని సానియా,మనాల లింగన్న, కార్యదర్శులు దయానంద్ కంబ్లే,పుండ్ర నర్సింగ్,టౌన్ ప్రెసిడెంట్ చంద్రాల రాహుల్,బిక్కి గంగన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను ప్రోత్సహిస్తూ మెరుగైన భవిష్యత్తును అందించాలి.- జిల్లా కలెక్టర్ రాజర్షిషా




**నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ఆదిలాబాద్ :**

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సాంకేతిక పరిజ్ఞానం,నిపుణుల వైద్య సేవలు అందిస్తూ మెరుగైన భవిష్యత్తును అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు.బుధవారం పట్టణంలోని డబ్ల్యూ కన్వేషన్ హాలులో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అవసరాల గల పిల్లల తల్లిదండ్రులకు నిర్వహించిన ఒక రోజు అవగాహన సదస్సులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజ్యలక్ష్మితో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా బాలకేంద్రం చిన్నారులు చేసిన స్వాగత నృత్య ప్రదర్శన ఆహ్వానితులను ఆకట్టుకుంది.ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,భవిత సెంటర్లలో ఏఐ (కృత్రిమ మేధ) సాంకేతికతతో పాటు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ అందుబాటులోకి తెస్తున్నామని, ఫిజియోథెరపిస్టులు, స్పీచ్ థెరపిస్టులను నియమించి పిల్లలకు తగిన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.భవిత సెంటర్లలో ఇచ్చే చికిత్సలు,శిక్షణలో ఎలాంటి విరామం రాకుండా తల్లిదండ్రులు ప్రతి రోజూ తమ పిల్లలను సెంటర్లకు పంపించాలని సూచించారు.మధ్యలో గ్యాప్ వస్తే పిల్లలు కోలుకునే ప్రక్రియ మరింత ఆలస్యమవుతుందన్నారు.గర్భధారణ సమయంలోనే 'టీఫా' స్కాన్ ద్వారా పిల్లలలో వచ్చే లోపాలను ముందే గుర్తించవచ్చని,జన్మించిన వెంటనే సమస్య ఉన్న పిల్లలను 'రిమ్స్' లోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ కి తీసుకెళ్లి వైద్యం అందిస్తే త్వరగా సాధారణ స్థితికి వస్తారని వివరించారు.దివ్యాంగ పిల్లల కోసం ప్రభుత్వం రవాణా,రీడింగ్,ఎస్కార్ట్ అలవెన్సులు, స్టైఫండ్ వంటి సదుపాయాలను నేరుగా అందిస్తోందని తెలిపారు.త్వరలోనే అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని,దీనికోసం ప్రతి ఒక్కరూ యూడిఐడి కార్డ్,బెంచ్ మార్క్ డిసేబిలిటీ సర్టిఫికెట్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు.'దివ్యాంగుల హక్కుల చట్టం 2016' ద్వారా ఉన్నత విద్య,ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పెరిగాయని గుర్తుచేశారు.ఇటీవలే జరిగిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రీడల్లో ఆదిలాబాద్ జిల్లా మొదటి స్థానంలో నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ,పిల్లల్లోని ప్రతిభను ప్రోత్సహించాలని తల్లిదండ్రులను కోరారు.డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ,ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల భవిష్యత్తుకు భరోసానిస్తూ,వారిని సమాజంలో ఉన్నత స్థాయికి తీసుకురావడం మనందరి సామాజిక బాధ్యతని పిలుపునిచ్చారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలలో అపారమైన ప్రతిభ ఉంటుందని,వారికి సరైన అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సాధిస్తారని అన్నారు.తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు ఎంతో ఓపికతో,ప్రేమతో ఈ పిల్లలను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు.ప్రభుత్వం,విద్యాశాఖ ద్వారా అందుబాటులో ఉన్న సౌకర్యాలు,ఉన్నత విద్యా అవకాశాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.పిల్లలను ఇళ్లకే పరిమితం చేయకుండా,సమాజంలో ముందుకు నడిపించేందుకు అవగాహన పెంచాలని సూచించారు.సమాజంలో ఇబ్బందులు పడుతున్న ఇతర కుటుంబాలకు సైతం ధైర్యాన్ని నింపి,ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.అనంతరం పలువురు ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులను కలెక్టర్,కార్యదర్శి సన్మానించారు.ఈ అవగాహన సదస్సులో చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు గంగారాం,జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.సాధన,జిల్లా సంక్షేమ అధికారి మిల్కా,రాష్ట్ర రిసోర్స్ పర్సన్ జగదీశ్వర్,జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి,ప్రత్యేక అవసరాలు గల పిల్లలు,వారి తల్లిదండ్రులు,ఇతర అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సహజ మరణానికి రూ.5 లక్షల బీమా ఇవ్వాలి.

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ప్రతినిధి, ఆత్మకూర్ వనపర్తి జిల్లా

తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం టియూసిఐ వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆత్మకూర్ మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ సమీపంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సి. రాజు అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. అరుణ్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. మోష, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. రాజు, తెలంగాణ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. వక్తలు మాట్లాడుతూ తెలంగాణలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రైవేటు బీమా సంస్థలకు అప్పగించిన విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సీఎస్సీ ఆరోగ్య పరీక్షల విధానాన్ని రద్దు చేసి హెల్త్ కార్డులు జారీ చేయాలని, 60 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు కనీసం రూ.9 వేల పెన్షన్ అందించాలని, సహజ మరణానికి రూ.5 లక్షల బీమా సాయం కల్పించాలని కోరారు. అదేవిధంగా డెలివరీ, మ్యారేజ్ గిఫ్ట్ సంక్షేమ పథకం కింద ప్రస్తుతం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని రూ.1 లక్షకు పెంచి సంక్షేమ బోర్డు ద్వారానే యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. చదువులేక లేదా ఇతర కారణాలతో సకాలంలో రెన్యువల్ చేసుకోలేకపోయిన భవన నిర్మాణ కార్మికుల సభ్యత్వాలను ప్రభుత్వమే స్వయంగా పునరుద్ధరించాలని, పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఐటీఐలకు మంజూరైన రూ.667 కోట్ల నిధులను నిలిపివేయాలని కూడా ప్రభుత్వాన్ని కోరారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే అన్ని కార్మిక సంఘాలను ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ



కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం, అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా నాయకులు జి. వెంకటయ్య, బి. చింతలన్న, కురుమన్న పాల్గొని మాట్లాడారు. అలాగే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి. చెన్నయ్య, తిరుపతి, మన్యం, ఎల్. రాజు, బి. రాజు, వెంకటేష్, సీనియర్ తాపీ మేస్త్రీలు ఈదన్న, చిన్న బాలస్వామి, మాల వెంకటన్న, వడ్డే రాములు, చిన్న, బాలయ్య, ఎం. అంజి, దేవన్న, మన్నెం, ఎం. రాజు, యాకోబు, బి. రవి, శేఖర్, రాజన్న, బీచ్‌పల్లి, నాగన్న, శ్రీశైలం, తిప్పన్న, మైబు, కురుమూర్తి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ రామచంద్రాపురం సంగారెడ్డి జిల్లా

పటాన్చెరు నియోజకవర్గం ముత్తంగి డివిజన్ పరిధిలోని వెలిమలలో 36 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న స్మశాన వాటిక రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్ సీనియర్ నాయకులు దేవేందర్ యాదవ్ ఉమేష్ మల్లారెడ్డి కొమరయ్య శ్రీశైలం నాగరాజు రవీందర్ రెడ్డి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



# అన్ని ఆలయాలలో ఏర్పాట్లు చేయిస్తా

## మాజీ కార్పొరేటర్ పుష్పానగేష్

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ రామచంద్రాపురం

మంగళవారం రామచంద్రాపురం డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద శ్రీశ్రీశ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో ఆషాడమాస సందర్భంగా సోమేశ్వర స్వామి కి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ రానున్న శ్రావణమాస బోనాలకు మీకు అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చిరు మాజీ కార్పొరేటర్ పుష్పానగేష్ ఆషాఢమాసంలో జరగనున్న బోనాలకు శ్రావణమాసంలో జరగనున్న బోనాలకు అన్ని ఆలయాలలో అన్ని రకాల ఏర్పాట్లు చేయిస్తా నని ఆమె హామీ ఇచ్చారు



# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## మంజులాపూర్ పాఠశాలలో నిర్మల్ పోలీసుల అవగాహన సదస్సు

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్,నిర్మల్ బ్యూరో, ఆగస్టు 5.

సైబర్ నేరాల బారిన పడకుండా విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ ఎల్. వెంకట రమణ సూచించారు. నిర్మల్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం మంజులాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైబర్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. బ్యాంకు ఖాతా నుంచి అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లయితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. నిర్మల్ రూరల్ ఎస్ఐ లింబాద్రి మాట్లాడుతూ ఓటీపీ పిన్‌లు, పాస్‌వర్డ్‌లు గోప్యంగా ఉంచుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్ ఎస్ఐ ముత్యం మాట్లాడుతూ బాలికలు వ్యక్తిగత ఫోటోలను సోషల్ మీడియా స్టేటస్‌లుగా లేదా వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాటిని మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సిద్ధ పద్మ సైబర్ భద్రతపై విద్యార్థులకు పలు సూచనలు చేయగా, సీనియర్ ఉపాధ్యాయురాలు శ్రీమతి హేమలత విద్యార్థులు ఈ అవగాహనను తమ తల్లిదండ్రులకు కూడా చేరవేయాలని కోరారు. అనంతరం పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులతో



కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్ కుమార్, రాజేందర్, చట్ల శ్రీనివాస్, మోరే శ్రీనివాస్, మసియుద్దీన్, విద్యారాణి, ఆశా

# ఆగస్టు 10 జైల్ భరోను జయప్రదం చేయండి.

## కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు



నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ప్రతినిధి, మదనాపూర్, వనపర్తి జిల్లా.

మదనాపూర్ మండల కేంద్రంలోని గ్రంథాలయం ముందు బుధవారం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండల సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాములు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మండ్ల రాజు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. అజయ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు, కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసనగా ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించే 'జైల్ భరో' కార్యక్రమాన్ని వనపర్తి జిల్లాలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను జీరో టాక్స్‌తో దిగుమతి చేసుకునేందుకు అంగీకరించడం వల్ల దేశ రైతాంగ ప్రయోజనాలు దెబ్బతింటాయని, వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. అలాగే కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చడం కార్మిక హక్కులకు విఘాతమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచి కొత్త పథకాలను తీసుకురావడం ద్వారా గ్రామీణ పేదల జీవనోపాధిపై ప్రభావం చూపుతున్నారని ఆరోపించారు. దేశ సంపద, గనులు, అడవులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, విద్యుత్ రంగాన్ని కూడా ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లును తీసుకొచ్చిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర విధానాలకు అనుగుణంగా విద్యుత్ బిల్లును అమలు చేసేందుకు, మూడో డిస్కంను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించడం రైతులు, ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలపై పడుతున్న భారానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని పేర్కొన్నారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఐక్యంగా ఉద్యమించాలని, ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేసి వేలాదిగా పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అనసూయ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మండ్ల సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బంగారయ్య, ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు, పీఎన్ఎం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు మొగిలి, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా నాయకులు అంజి, చెన్నయ్య, అజయ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి అభివృద్ధికి భారీ నిధులు సాధించిన ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ కామారెడ్డి బ్యూరో

కామారెడ్డి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ నిరంతరం కృషి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల మంత్రులతో సమన్వయం చేసి కోట్లాది రూపాయల అభివృద్ధి నిధులను సాధిస్తున్నారు. ఆయన నిరంతర కృషి ఫలితంగానే కామారెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాల అభివృద్ధి కోసం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.75.19 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో హమ్ ఏజెన్సీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఆధ్వర్యంలో కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి ఘనంగా సన్మానించి, కామారెడ్డి అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేసినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధి కోసం రూ.30 కోట్ల నిధులు మంజూరు చేసిన రోడ్లు--భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి కూడా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఫోన్ ద్వారా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులతో నియోజకవర్గంలోని పలు ప్రధాన రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయని పేర్కొన్నారు. కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం మరిన్ని నిధులను రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకురావడానికి తాను నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. త్వరలోనే ఎఫ్‌డీఏ నిధుల కింద రూ.25 కోట్లు, మరో రూ.20 కోట్లు, అలాగే సీఆర్ఆర్ నిధుల కింద అదనంగా రూ.32 కోట్లు కూడా మంజూరు కానున్నాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో కామారెడ్డిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని, గ్రామీణ మౌలిక సదుపాయాలు, రహదారులు, తాగునీరు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అహర్నిశలు శ్రమిస్తూ వివిధ శాఖల మంత్రులతో నిరంతరం సమన్వయం చేసి భారీ మొత్తంలో నిధులు మంజూరు చేయించడాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అభినందించారు. రానున్న రోజుల్లో కూడా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి కామారెడ్డిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని షబ్బీర్ తెలిపారు.





# మన ఊరు మన భద్రత మన బాధ్యత

నేషనలిస్ట్ వాయిస్ న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మన ఊరు మన భద్రత మన బాధ్యత అనే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహనా కల్పించారు. ముఖ్య అతిథిగా ఎస్సై శైలేందర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా మంచి మార్గంలో ఉంటూ దేశ అభివృద్ధికి తోడ్పడాలని, దేశ అభివృద్ధిలో యువత పాత్ర ఎక్కువగా ఉన్నందున చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మురళి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోహిత్ తనంతట తాను వైదొలిగే ప్రసక్తే లేదు

## రోహిత్ శర్మ రిటైర్మెంట్ పై మహమ్మద్ కైఫ్ వ్యాఖ్యలు



భారత వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ అంశంపై టీమిండియా మాజీ ఆటగాడు మహమ్మద్ కైఫ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ తనంతట తానుగా క్రికెట్ నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని, ఒకవేళ అతన్ని తొలగించాలనుకుంటే సెలెక్టర్లే ఆ పని చేయాలని నేరుగా సవాలు విసిరాడు. 2027 ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఆడతాడా లేదా అనే దానిపై బోర్డు ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన ప్రకటన చేయకపోవడంపై కైఫ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాడు.సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియాల వేదికగా జరగనున్న 2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఆడతాడా లేదా అనే ప్రశ్న అభిమానులతో పాటు విశ్లేషకులను కూడా వేధిస్తోంది. జులై 19న ఆడే మ్యాచే రోహిత్ చివరి అంతర్జాతీయ మ్యాచ్ అంటూ వచ్చిన వార్తలను బిసిసిఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా ఖండించినప్పటికీ, రోహిత్ భవిష్యత్తుపై మాత్రం మేనేజ్‌మెంట్ నుంచి ఎలాంటి అధికారిక హామీ లభించలేదు. దీనిపై కైఫ్ తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ "రోహిత్‌కు నచ్చినట్లు ఆడే స్వేచ్ఛ ఇచ్చామని చెబుతున్న కోచ్‌లు, అతను 2027 వరల్డ్ కప్ ప్లాన్స్‌లో ఉన్నాడో లేదో స్పష్టంగా ఎందుకు చెప్పడం లేదు?" అని నిలదీశాడు.గతంలో లార్డ్స్ మైదానంలో జులై 19న జరిగే వన్డేనే రోహిత్‌కు చివరిదని ప్రచారం జరిగింది. కానీ ఆ వార్తలను బీసీసీఐ ఖండించడమే కాకుండా, ఆ మ్యాచ్‌లో రోహిత్ శర్మ కేవలం 84 బంతుల్లో 17 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 138 పరుగులతో విరవిరుచుకుపడ్డాడు. ఇది అతనికి వన్డేల్లో 34వ సెంచరీ కాగా, 2026 సంవత్సరంలో తొలి సెంచరీ. భారత్ ఆ మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికీ రోహిత్ బ్యాటింగ్‌తో విమర్శకుల నోళ్లు మూయించాడు. బోర్డు జోక్యం చేసుకోవడం, రోహిత్ సెంచరీ బాదడం వల్ల ఆ సమయంలో పెద్ద వివాదం తప్పిందని కైఫ్ పేర్కొన్నాడు.జట్టు మేనేజ్‌మెంట్, బీసీసీఐ పబ్లిక్‌గా సరైన ప్రకటన చేయకపోవడం వల్లే అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని కైఫ్ అభిప్రాయపడ్డాడు. ఆటగాడి ఫామ్‌లో హెచ్చుతగ్గులు సహజమని, బోర్డు రోహిత్‌కు పూర్తి మద్దతుగా నిలబడాల్సిన అవసరం ఉందన్నాడు. బయట ఉన్నవారికి లోపల ఏం జరుగుతుందో పూర్తిగా తెలియకపోయినా, రోహిత్ శర్మ మాత్రం తనను ఎవరూ తప్పించలేరని, ఒకవేళ వెళ్లాలనుకుంటే ఆ నిర్ణయం తన చేతుల్లోనే ఉంచుకోవాలని భావిస్తున్నాడని కైఫ్ స్పష్టం చేశాడు. రోహిత్ శర్మను వన్డే జట్టులో కొనసాగించాలా వద్దా అనే విషయమై సెలెక్టర్ల మధ్య కూడా లోపల మంతనాలు జరుగుతున్నాయని, ఇంకా ఎలాంటి ఆఖరి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. రాబోయే పర్యటనలు, సిరీస్‌ల ఆధారంగా బీసీసీఐ రోహిత్ శర్మ విషయంలో ఒక స్పష్టమైన ప్రకటన చేసే అవకాశం కనిపిస్తోంది.



# 2027 వన్డే ప్రపంచకప్ షెడ్యూల్ ప్రకటించిన ఐసీసీ

ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 వరకు మ్యాచ్ లువచ్చే ఏడాది సౌతాఫ్రికా వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక 2027 వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్‌కు సంబంధించి ఐసీసీ ఒక కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఈ టోర్నీకి అర్హత సాధించేందుకు నిర్వహించే క్వాలిఫైయర్స్ మ్యాచ్‌ల తేదీలను ఐసీసీ అధికారికంగా ప్రకటించింది. 10 జట్లు పాల్గొనే ఈ క్వాలిఫైయర్ రౌండ్ 2027 ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 మధ్య జరగనుంది. అయితే ఈ మ్యాచ్‌లను ఏ దేశంలో లేదా ఏ వేదికల్లో నిర్వహిస్తారనే దానిపై ఐసీసీ ఇంకా ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు.ఈసారి జరగబోయే వన్డే ప్రపంచకప్‌ను ఐసీసీ సరికొత్త ఫార్మాట్‌లో నిర్వహించబోతోంది. ఈ మెగా టోర్నీలో మొత్తం 14 జట్లు పోటీపడనున్నాయి. క్వాలిఫైయర్‌లో గెలిచిన టాప్ టీమ్ నేరుగా ఈ 14 జట్ల ప్రధాన గ్రూప్‌లో చోటు దక్కించుకుంటుంది. ఇక క్వాలిఫైయర్స్ పాయింట్ల పట్టికలో రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచే జట్ల మధ్య సూపర్ సిరీస్ పోరు జరుగుతుంది. ఇది ప్రపంచకప్ మొదటి రౌండ్‌గా పరిగణించబడుతుంది. ఈ రౌండ్‌లో విజయం సాధించిన జట్లు ఆ తర్వాత టాప్-12 లోకి అడుగుపెడతాయి. ఈసారి వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్ మూడు ఆఫ్రికన్ దేశాల ఉమ్మడి ఆతిథ్యంలో జరగనుంది. సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు కలిసి ఈ టోర్నీని నిర్వహించనున్నాయి. టోర్నీలోని మొత్తం మ్యాచ్‌లను 12 వేర్వేరు స్టేడియంలలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో అత్యధికంగా 8 వేదికలు సౌతాఫ్రికాలోనే ఉన్నాయి. మిగిలిన వాటిలో 3 వేదికలు జింబాబ్వేలో, 1 వేదిక నమీబియాలో ఉన్నాయి. మెయిన్ ప్రపంచకప్ మ్యాచ్‌లు 2027 అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21 వరకు జరగనున్నాయి. క్వాలిఫైయర్ రౌండ్‌లో మొత్తం 10 జట్లు పాల్గొంటాయి. సెప్టెంబర్ 30, 2026 నాటికి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో చివరన ఉండే రెండు ఫుల్ మెంబర్ జట్లు (ఆతిథ్య దేశాలైన సౌతాఫ్రికా, జింబాబ్వేలు మినహా) ఈ క్వాలిఫైయర్‌లో ఆడాల్సి ఉంటుంది. వీరితో పాటు సిడబ్ల్యూసి లీగ్ 2లో టాప్-4 లో నిలిచిన జట్లు, అలాగే వరల్డ్ కప్ క్వాలిఫైయర్ ప్లేఆఫ్స్?లో టాప్-4 లో నిలిచిన జట్లు కలసి మొత్తం 10 జట్లు ఈ క్వాలిఫైయర్స్ లో తలపడతాయి. త 2023 వన్డే ప్రపంచకప్‌లో క్వాలిఫైయర్ రౌండ్‌లోనే ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించిన మాజీ ఛాంపియన్ వెస్టిండీస్‌కు మళ్లీ అలాంటి పరిస్థితే ఎదురయ్యేలా కనిపిస్తోంది. ప్రస్తుతం వన్డే ర్యాంకింగ్స్‌లో విండీస్ 10వ స్థానంలో ఉంది. సెప్టెంబర్ 30 కట్-ఆఫ్ తేదీకి ముందు కరేబియన్ జట్టు కేవలం 2 వన్డేలు మాత్రమే ఆడనుంది (అవి భారత్‌తో జరగనున్నాయి). అటు అఫ్గానిస్థాన్, ఐర్లాండ్ మధ్య జరిగే వన్డే సిరీస్ ఫలితాలు కూడా వెస్టిండీస్ భవిష్యత్తును శాసిస్తాయి. ఐర్లాండ్ 4-1 లేదా 5-0 తో గెలిచి, వెస్టిండీస్ భారత్‌పై రెండు వన్డేల్లోనూ విజయం సాధిస్తేనే కరేబియన్ జట్టు నేరుగా టాప్-8 కి చేరుకునే అవకాశం ఉంటుంది.

# భారత చీఫ్ సెలెక్టర్‌గా వీవీఎస్ లక్ష్మణ్!?

## అజిత్ అగార్కర్‌పై వేటుపడే అవకాశం



భారత క్రికెట్ పురుషుల సెలెక్షన్ కమిటీ చీఫ్ సెలెక్టర్‌గా మళ్లీ తెలుగు వ్యక్తి బాధ్యతలు చేపట్టబోతున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. టీమిండియా దిగ్గజ క్రికెటర్, తెలుగు తేజం, సొగసరి బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్ చీఫ్ సెలెక్టర్ పదవి రేసులో ఉన్నట్లు తెలుస్తోంది.టీమిండియా వరుస పరాజయాల నేపథ్యంలో ప్రస్తుత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌పై వేటు పడే అవకాశం ఉంది. అతని కాంట్రాక్ట్‌ను పొడిగించేందుకు బీసీసీఐ సుముఖంగా లేదని ఓ సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్ట్ సోషల్ మీడియా వేదికగా ఓ కథనాన్ని రాయడం తీవ్ర చర్చనీయాంశమైంది. 'భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవి ప్రమాదంలో పడింది. అతన్ని కొనసాగించేందుకు బీసీసీఐ సుముఖంగా లేదు. భారత నయా చీఫ్ సెలెక్టర్ పదవి రేసులో వీవీఎస్ లక్ష్మణ్ ముందంజలో ఉన్నారు. వీవీఎస్ లక్ష్మణ్ ఎంట్రీతో అజిత్ అగార్కర్‌కు ఉద్వాసన తప్పేలా లేదు. ప్రస్తుతం ఈ వ్యవహారం చర్చల దశలోనే ఉంది. సెప్టెంబర్‌లో జరిగే బీసీసీఐ వార్షిక సర్వ సభ్య సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. లక్ష్మణ్ చీఫ్ సెలెక్టర్‌గా ఉంటే అతని మాటలకు విలువ ఉంటుందని, రోహిత్, విరాట్ కోహ్లీ వంటి ఆటగాళ్లు కూడా అతని సలహాలు పాటిస్తారని బీసీసీఐ అధికారులు భావిస్తున్నారు. ఇటీవల టీమ్ సెలెక్షన్ విషయంలో అగార్కర్ తీసుకున్న కొన్ని నిర్ణయాలపై ప్రశ్నలు తలెత్తాయి. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని అగార్కర్‌ను కొనసాగించాలా? లేక లక్ష్మణ్‌ను తీసుకురావాలా?అనేది బీసీసీఐ బేరిజు వేస్తోంది. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్ ఫలితంపైనే ఈ నిర్ణయం ఆధారపడి ఉంది. ఒకవేళ భారత్ ఈ సిరీస్‌ను గెలిస్తే.. అగార్కర్ పదవీకాలం పొడిగించవచ్చు. రోహిత్ శర్మ రిటైర్మెంట్ వార్తలపై కూడా బీసీసీఐ పెద్దలు ఆగ్రహంగా ఉన్నారు. సెక్రటరీ దేవజిత్ సైకియా వచ్చి వివరణ ఇవ్వాల్సి వచ్చింది. ప్రస్తుతం భారత జట్టును నడిపిస్తున్న వారికి రోహిత్ శర్మ జట్టులో కొనసాగడం ఇష్టం లేదు.ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో ఎదురైన ఓటములపై ఇప్పటివరకు సమీక్షా సమావేశం జరగలేదు. ఇంగ్లండ్ పర్యటన తర్వాతే ఈ రివ్యూ మీటింగ్ జరగాల్సింది. కానీ దేజిత్ సైకియా అనారోగ్యం కారణంగా ఈ సమీక్ష సమావేశం జరగలేదని బోర్డు వర్గాలు తెలిపాయి. రాబోయే రోజుల్లో ఈ సమావేశం జరగనుంది. గంభీర్.. ఆన్‌లైన్ వేదికగా ఈ మీటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంది.'అని అభిషేక్ త్రిపాఠి అనే స్పోర్ట్స్ జర్నలిస్ట్ తన కథనంలో రాసుకొచ్చాడు.2023 జూలైలో భారత చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అజిత్ అగార్కర్ పదవి కాలం ఈ ఏడాది సెప్టెంబర్‌లో ముగియనుంది. టీమిండియా సపోర్ట్ స్టాఫ్ మెంబర్స్ టీ దిలీప్, ర్యాన్ టెన్ దస్కాటే తరహాలో అజిత్ అగార్కర్‌పై బీసీసీఐ వేటు వేస్తుందా? లేక కొనసాగిస్తుందా? అనేది చూడాలి. తెలుగు రాష్ట్రాల నుంచి ఎమ్మెస్కే ప్రసాద్ చివరిసారిగా భారత చీఫ్ సెలెక్టర్‌గా వ్యవహరించారు.

# చరిత్ర సృష్టించిన పాక్ ఆటగాడు అబ్దుల్లా షఫీక్



క్వీన్స్ పార్క్ ఓవల్ మైదానంలో వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో పాకిస్థాన్ జట్టు అత్యంత బలమైన స్థితికి చేరుకుంది. మొదటి ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ అబ్దుల్లా షఫీక్ అద్భుతమైన డబుల్ సెంచరీకి చేరువగా వెళ్లి 160 పరుగులతో నాటౌట్‌గా నిలిచి చరిత్ర సృష్టించాడు. అతని వీరోచిత ఇన్నింగ్స్ కారణంగా పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ తన రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 60 పరుగుల స్వల్ప ఆధిక్యంతో 6 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది.కరేబియన్ గడ్డపై వెస్టిండీస్‌పై టెస్టుల్లో 150 కంటే ఎక్కువ పరుగులు సాధించి ఏకంగా 49 ఏళ్ల క్రితం నాటి రికార్డును అబ్దుల్లా షఫీక్ తిరగరాశాడు. చివరిసారిగా 1977లో పాకిస్థాన్ దిగ్గజ ఆటగాడు మాజిద్ ఖాన్ విండీస్ గడ్డపై 167 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. ఆ తర్వాత ఇన్ని సంవత్సరాలకు అబ్దుల్లా షఫీక్ మాత్రమే మళ్లీ ఈ ఘనత సాధించాడు. కరేబియన్ గడ్డపై వెస్టిండీస్‌పై 150 ప్లస్ పరుగులు చేసిన ఐదవ పాకిస్థాన్ బ్యాటర్‌గా షఫీక్ రికార్డుల్లోకెక్కాడు. ఇక 1958లో హనీఫ్ మహమ్మద్ సాధించిన 337 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఇప్పటికీ ఇక్కడ అత్యధిక వ్యక్తిగత స్కోరుగా ఉంది.పాకిస్థాన్ ఇన్నింగ్స్ ప్రారంభంలో ఓపెనర్లు అజాన్ అవైస్ (55), ఇమామ్ ఉల్ హక్ (14) కలసి 98 పరుగులు జోడించి అవుట్ అయ్యారు. మూడో వికెట్‌కు బ్యాటింగ్‌కు వచ్చిన అబ్దుల్లా షఫీక్, కెప్టెన్ బాబర్ ఆజమ్‌తో కలిసి కొండంత భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు ఏకంగా 183 పరుగులు జోడించారు. కెప్టెన్ బాబర్ ఆజం ఎంతో నిలకడగా ఆడి సెంచరీ దిశగా సాగినప్పటికీ, బ్రాండన్ కింగ్ వేసిన అద్భుతమైన త్రోకి 88 పరుగుల వద్ద రనౌట్ అయ్యాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా అబ్దుల్లా షఫీక్ చివరి వరకు నిలబడి 160 రన్లతో పాకిస్థాన్‌ను 387 పరుగుల మార్కుకు చేర్చాడు.ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు తమ మొదటి ఇన్నింగ్స్‌లో 344 పరుగులకు ఆలౌట్ అయింది. జస్టిన్ గ్రీవ్స్ (73), రోస్టన్ చేజ్ (70) ల హాఫ్ సెంచరీలతో విండీస్ ఆ మాత్రం స్కోరైనా సాధించగలిగింది. పాకిస్థాన్ బౌలర్లలో సజిద్ ఖాన్ అత్యధికంగా 4 వికెట్లు తీసి విండీస్ నడుం విరగ్గొట్టగా, మహమ్మద్ అలీ, ఉబైద్ షా, అలీ ఉస్మాన్ తలా 2 వికెట్లు తీసి ఆకట్టుకున్నారు.పాకిస్థాన్ సాధించిన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం తర్వాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ ఆటగాళ్లు పాక్ బౌలర్ల ధాటికి నిలవలేకపోయారు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ 6 వికెట్ల నష్టానికి కేవలం 103 పరుగులు మాత్రమే చేసింది. ప్రస్తుతం విండీస్ చేతిలో 4 వికెట్లు మాత్రమే ఉండగా, కేవలం 60 పరుగుల స్వల్ప ఆధిక్యంలో ఉండి ఓటమి అంచున నిలిచింది. ఈ మ్యాచ్‌ను గెలిచి రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1 తో సమం చేసే అవకాశాన్ని పాకిస్థాన్ చేజిక్కించుకుంది.

# మిస్సింగ్ మేఘన ..ఫస్ట్ లుక్ విడుదల

రామ్ కార్తీక్ హీరోగా, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ చిత్రం 'మిస్సింగ్ మేఘన'. ఫస్ట్ కాపీ మూవీస్ మరియు కేడి అండ్ కో బ్యానర్లపై పంచమర్తి నరేష్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి వాచస్పతి దర్శకత్వం వహిస్తున్నారు. గోపరాజు రమణ, వెంప కాశి, కౌశిక్, మహిపాల్, రుచిత, నళిని, శ్రీనివాస్, అజీమ్, పండు తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ రివీలింగ్ పోస్టర్ లాంచ్ కార్యక్రమం టాలీవుడ్ ప్రముఖ టెక్నీషియన్లు, సినీ ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ఈ చిత్ర పోస్టర్‌ను తన చేతుల మీదుగా విడుదల చేసి సినిమా యూనిట్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బెక్కం వేణుగోపాల్‌తో పాటు చిత్ర బృందమంతా ఉత్సాహంగా పాల్గొంది. ఈ సందర్భంగా వి.వి. వినాయక్ మాట్లాడుతూ, బెక్కం వేణుగోపాల్, శ్రీనివాస్ ల సహకారంతో దర్శకుడు వాచస్పతి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారని తెలిపారు. ఈ సినిమాతో హీరో రామ్ కార్తీక్, దర్శకుడు వాచస్పతిలకు మంచి పేరు రావాలని, అలాగే సంగీతంతో పాటు పాటలు కూడా అందించే ఆల్ రౌండర్ ధృవన్‌కు ఈ చిత్రం ద్వారా మంచి గుర్తింపు దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ చిత్ర యూనిట్ మొత్తానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ, వి.వి. వినాయక్ గారిది గో÷-డలెన్ హ్యాండ్ అని, ఆయన చేతుల మీదుగా తమ సినిమా పోస్టర్ లాంచ్ కావడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మీడియా సహకారంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ చిత్రం ఒక చక్కటి సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఉంటుందని, ప్రేక్షకులను అలరించే అన్ని కమర్షియల్ హంగులు ఇందులో ఉన్నాయని తెలిపారు. అతి త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు. హీరో రామ్ కార్తీక్ మాట్లాడుతూ, తమకు ఈ చిత్రంలో అవకాశం కల్పించిన దర్శకుడు వాచస్పతికి, నిర్మాత నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమా ఖచ్చితంగా ప్రేక్షకులందరినీ అలరిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధృవన్ మాట్లాడుతూ, లెజెండ్రీ డైరెక్టర్ వి.వి. వినాయక్ చేతుల మీదుగా పోస్టర్ విడుదల కావడం తన కెరీర్‌లో మరువలేని




# విడుదలకు సిద్ధం అవుతున్న కొరియన్ కనకరాజు




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటించిన ఇండో-కొరియన్ హారర్ కామెడీ 'కొరియన్ కనకరాజు' విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ప్రముఖ కమెడియన్ సత్య కీలక పాత్ర పోషించారు. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో సినిమా చూసిన వారి ఒపీనియన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా కామెడీ, వరుణ్ తేజ్ నటన, థమన్ సంగీతం సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయని టాక్ వినిపిస్తోంది. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఎక్స్‌ప్రెస్ రాజా' వంటి విజయవంతమైన కామెడీ చిత్రాలను తెరకెక్కించిన మేర్లపాక గాంధీ, మరోసారి తన మార్క్ కామెడీని ఈ చిత్రంలో చూపించినట్లు సమాచారం. సినిమా తొలి భాగం నుంచి రెండో భాగం వరకు పలు కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని సెన్సార్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఇంటర్వెల్ ముందు, తర్వాత వచ్చే ఎపిసోడ్లు బాగా వర్కవుట్ అయ్యాయని అంటున్నారు. అలాగే వరుణ్ తేజ్, సత్య మధ్య వచ్చే కామెడీ ట్రాక్‌తో పాటు బుల్లిరాజు పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు కూడా మంచి వినోదాన్ని అందిస్తాయని సమాచారం. సినిమాలో వరుణ్ తేజ్ రెండు విభిన్న కోణాలు ఉన్న పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. అనంతపురం జిల్లా పెనుగొండకు చెందిన సాధారణ యువకుడు కనకరాజు పాత్రలో ఒకవైపు కనిపిస్తే, మరోవైపు కొరియన్ గ్యాంగ్‌స్టర్ ఆత్మ ఆవహించిన తర్వాత పూర్తిగా భిన్నమైన వ్యక్తిత్వంతో కనిపించనున్నారని టాక్. ఈ రెండు పాత్రల మధ్య బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, స్టైల్ పరంగా వరుణ్ తేజ్ మంచి వేరియేషన్ చూపించారని సినిమా చూసిన వారు చెబుతున్నారు. కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే వరుణ్ తేజ్ ఈసారి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో కూడా తన నటనతో ఆకట్టుకున్నారని సమాచారం. సినిమా కథ ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో రూపొందినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని కియా కంపెనీలో ఉద్యోగం కోసం కొరియా నుంచి వచ్చిన యువతి పాత్రలో రితికా నాయక్ కనిపించనుంది. ఆమెను ప్రేమించే కనకరాజు జీవితంలో అనుకోని మలుపు తిరుగుతుంది. కొరియా నుంచి వచ్చిన ఓ బాటిల్‌లో బంధించబడిన గ్యాంగ్‌స్టర్ ఆత్మ బయటకు వచ్చి కనకరాజును ఆవహిస్తుంది. ఆ తర్వాత కనకరాజు జీవితం ఎలా మారింది? ఆ ఆత్మ కొరియాతో ఉన్న సంబంధం ఏమిటి? చివరకు కథ ఎలాంటి మలుపు తిరిగింది? అనే అంశాల చుట్టూనే సినిమా సాగుతుందని తెలుస్తోంది. సినిమాకు సంగీత దర్శకుడు ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు కథకు మరింత బలం చేకూర్చాయని సమాచారం. కామెడీ తర్వాత ఎక్కువ ప్రశంసలు సంగీతానికే వస్తాయని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.

న్యాచురల్ స్టార్ నాని హీరోగా, కయాదు లోహర్ హీరోయిన్‌గా మాస్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రం 'ది ప్యారడైజ్'. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే, సరిగ్గా అదే తేదీన నానితో పోటీ పడేందుకు ఆయన 'దసరా' సహనటి కీర్తి సురేష్ సిద్ధమవుతుండటం ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ కోలీవుడ్ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కిస్తున్న 'దోరతి'




# ప్యారడైజ్‌తో పోటీ పడనున్న దోరతి




చిత్రంలో కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. సంగీత మాంత్రికుడు ఇళయరాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఇప్పటికే ప్రకటించింది. ప్రస్తుతానికి ఈ రిలీజ్ డేట్‌ను తమిళ వెర్షన్ కోసం లాక్ చేసినప్పటికీ, తెలుగులోనూ ఇదే తేదీకి వస్తే బాక్సాఫీస్ వద్ద నాని సినిమాతో కీర్తి సురేష్ నేరుగా పోటీ పడాల్సి వస్తుంది. మంచి స్నేహితులుగా ఉన్న నాని, కీర్తి సురేష్‌ల చిత్రాలు ఒకే తేదీన బరిలో నిలుస్తుండటంతో ఈ బాక్సాఫీస్ క్లాష్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చివరికి ఈ సినిమాల విడుదల తేదీల్లో మార్పులు ఉంటాయా లేదా అనేదానిపై త్వరలోనే క్లారిటీ రానుంది.




# ఆదిపురుష్‌తో రామాయణను పోల్చవద్దు

విజయం సాధించాలన్న మనోజ్ బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'. ఈ సినిమా ట్రైలర్ విడుదలైన నాటి నుంచి వార్తల్లో నిలుస్తోంది. గతంలో వచ్చిన 'ఆదిపురుష్'తో ఈ చిత్రాన్ని పోలుస్తూ కొందరు పోస్టులు పెడుతున్నారు. తాజాగా ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో 'ఆదిపురుష్' రచయిత మనోజ్ దీనిపై







మాట్లాడారు. 'రామాయణ'లో రావణుడి పాత్ర పోషించిన యశ్‌పై ప్రశంసలు కురిపించారు. యశ్ చాలా మంచి నటుడు. అందులో ఎలాంటి సందేహం లేదు. మన భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లే ఏ సినిమాకైనా నా పూర్తి మద్దతు ఉంటుంది. 'రామాయణ' మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఈ చిత్రాన్ని 'ఆదిపురుష్'తో పోల్చొద్దు. అది ప్రేక్షకుల అంచనాలను అందుకోలేపోయింది. ఆ సినిమా కోసం ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడ్డారు. అయితే, 'ఆదిపురుష్' సంగీతం మంచి ఆదరణ సొంతం చేసుకుంది. ఇప్పుడు రామాయణ మ్యూజిక్ కూడా హిట్ కావడం నాకు చాలా ఆనందంగా ఉంది' అని మనోజ్ తెలిపారు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా కనిపించనున్న రామాయణ చిత్రం రెండు భాగాలుగా రానుంది. ఇప్పటికే రెండో భాగం కూడా 50 శాతం షూటింగ్ పూర్తయినట్లు రణ్‌బీర్ తెలిపారు. రామాయణ లాంటి గొప్ప కథను 10 భాగాలు తీయొచ్చని రెండు భాగాల్లోనే నితీశ్ తివారీ అద్భుతంగా తెరకెక్కిస్తున్నారని ప్రశంసించారు. దీపావళికి ఈ సినిమా మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# సందీప్ కిషన్ సరికొత్త చిత్రం కరికాల

యంగ్ హీరో సందీప్ కిషన్ తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. విభిన్న కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, ఇప్పుడు పీరియాడిక్ యాక్షన్ జానర్‌లోకి అడుగుపెడుతున్నారు. తాజాగా 'కరికాల' అనే భారీ చిత్రాన్ని అధికారికంగా ప్రకటిస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవలి కాలంలో పీరియాడిక్ కథలు, రాజుల చరిత్ర, యుద్ధ నేపథ్యంతో రూపొందుతున్న సినిమాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అదే తరహాలో ఇప్పుడు సందీప్ కిషన్ కూడా ఓ భారీ పీరియాడిక్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'శంబాల' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మహీధర్ రెడ్డి, రాజశేఖర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ శక్తివంతమైన యోధుడి పాత్రలో కనిపిస్తున్నారు. చేతిలో కత్తి పట్టుకుని గుర్రంపై యుద్ధానికి దూసుకెళ్తున్న ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో ఆయన పక్కనే ఓ సింహం కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యుద్ధభూమి వాతావరణం, భారీ విజువల్స్, పవర్‌ఫుల్ లుక్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. పోస్టర్‌ను బట్టి చూస్తే, ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాకుండా చారిత్రక నేపథ్యంతో కూడిన ఎమోషనల్ సాగా కూడా కావచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా తెరకెక్కించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. విడుదల తేదీలను కూడా అధికారికంగా వెల్లడించారు. 'కరికాల చాప్టర్ 1' : 2027 జూలై 2, 'కరికాల చాప్టర్ 2' : 2027 అక్టోబర్ 28 అంటే కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రెండు భాగాలను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేయడం విశేషం. ఇప్పటివరకు సందీప్ కిషన్ ఎక్కువగా యాక్షన్, థ్రిల్లర్, కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాల్లో కనిపించారు. అయితే 'కరికాల' తో తొలిసారి భారీ పీరియాడిక్ యాక్షన్ కథలో నటిస్తున్నారు. అయితే సినిమా కథ, ఇతర నటీనటులు, సాంకేతిక బృందానికి సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించే అవకాశం ఉంది. ప్రస్తుతం 'సిగ్మా' విడుదల కోసం సందీప్ కిషన్ ఎదురు చూస్తున్నారు. విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. జులై 31న 'సిగ్మా' విడుదల కావాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల ఇది వాయిదా పడింది.

PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656